


సీఎం రాక రేపు



- విమెన్ అండ్ చైల్డ్ హెల్త్ స్ర్కీనింగ్, 'స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమాలు, గ్లోబల్ కేపబులిటీ సెంటర్ సదస్సుకు హాజరు

విశాఖపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం విశాఖపట్నం వస్తున్నారు. ఆ రోజు ఉదయం తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి బీచ్‌రోడ్డులోని కోస్టల్ బ్యాటరీ వద్ద 11.15 గంటలకు దిగుతారు. అక్కడి నుంచి బీచ్ రోడ్డులోని ఏయూ సాగరిక ఫంక్షన్ హాలుకు చేరుకొని విమెన్ అండ్ చైల్డ్ హెల్త్ స్ర్కీనింగ్ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం 12 గంటలకు ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో 'స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' ప్రారంభ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటలకు హోటల్ రాడిసన్ బ్లూలో నిర్వహించే గ్లోబల్ కేపబులిటీ సెంటర్ సదస్సులో పాల్గొంటారు. సాయంత్రం ఐదు గంటలకు అక్కడ నుంచి బయలుదేరి కోస్టల్ బ్యాటరీకి చేరుకొని హెలికాప్టర్‌లో తాడేపల్లి వెళతారు.

ఏర్పాట్ల పరిశీలన

ముఖ్యమంత్రి పర్యటన ఖరారు కావడంతో సోమవారం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఇతర జిల్లా అధికారులు, పోలీసు అధికారులు ఆయా ప్రాంతాల్లో పర్యటించి, బందోబస్తు, ఇతర ఏర్పాట్లపై చర్చించి, పలు సూచనలు చేశారు.

నేడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రాక



విశాఖపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం రాత్రి విశాఖపట్నం వస్తున్నారు. నగరంలో బుధవారం నిర్వహించే పలు కార్యక్రమాల్లో ఆమె పాల్గొంటారు. ఆమె మంగళవారం రాత్రి 8.45 గంటలకు విశాఖ చేరుకొని రాడిసన్ బ్లూ హోటల్‌లో బస చేస్తారు. మరుసటిరోజు బుధవారం ఉదయం పది గంటలకు పీఎం పాలెంలోని వైజాగ్ కన్వెన్షన్ సెంటర్‌లో తరువాతి తరం జీఎస్టీ అవుట్‌రీచ్ కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించే స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో అక్కడి నుంచే వర్చువల్‌గా హాజరవుతారు. ఆ తరువాత హోటల్ రాడిసన్ బ్లూకి చేరుకొని మధ్యాహ్నం మూడు గంటలకు అక్కడ జరిగే గ్లోబల్ కేపబులిటీ సెంటర్ సదస్సులో పాల్గొంటారు. సాయంత్రం ఐదు గంటలకు పర్యటన ముగించుకొని ఢిల్లీ బయలుదేరి వెళతారు.

సర్వీస్ రంగంలో విశాఖకు ఏ+

- స్వచ్ఛాంధ్రలో 'బి' గ్రేడ్
- అమరావతిలో ప్రారంభమైన కలెక్టర్ల సదస్సులో ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంపై సమీక్ష



అమరావతిలో సీఎం సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో సర్వీస్ రంగంలో 90 పాయింట్లతో ఏ+ గ్రేడ్ సాధించింది. వార్షిక లక్ష్యం రూ.67,501 కోట్లు కాగా తొలి క్వార్టర్‌లో రూ.18,597 కోట్లు సాధించింది. వివిధ రంగాల్లో జిల్లాలు ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో ఎటువంటి ప్రగతి సాధించాయనే అంశాలపై సోమవారం అమరావతిలో జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన సదస్సులో సీఎం సమీక్షించారు. విశాఖపట్నం జిల్లా ... మిగతా 6వ పేజీలో

మెట్రో టెండర్లలో మార్పు

ఏకమొత్తంగా కాకుండా ప్రాజెక్టును విభజించి ఇవ్వాలని నిర్ణయం

- 19న ప్రీ బిడ్డింగ్ సమావేశం
- బిడ్ల దాఖలుకు అక్టోబరు ఏడో తేదీ వరకూ గడువు
- మొదటి దశలో 46 కి.మీ. పొడవున నిర్మాణం
- ఇందులో 20 కి.మీ. డబుల్ డెక్కర్ మోడల్



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టు పనులు ఒక అడుగు ముందుకు, రెండు అడుగులు వెనక్కి అన్నట్టుగా సాగుతున్నాయి. ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో సాయం చేయాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో భాగంగా 'మెట్రో రైలు' మంజూరైన సంగతి తెలిసిందే. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వలేదు కాబట్టి కోల్‌కత్తా మెట్రో రైలుకు ఎలాగైతే కేంద్రం వంద శాతం ఖర్చులు భరించిందో అదే విధంగా విశాఖ మెట్రో రైలుకు నిధులు ఇవ్వాలని సీఎం చంద్రబాబునాయుడు అడుగుతున్నారు. దీనిపై కేంద్ర పెద్దలు తర్జనభర్జన పడుతున్నారు.

కేంద్రం నుంచి గ్రీన్‌సిగ్నల్ లభించేంత వరకూ ప్రాజెక్టును పెండింగ్‌లో ఉంచకుండా ముందుకు నడిపించాలని రాష్ట్ర ప్రభుత్వం అమరావతి మెట్రో రైలు కార్పొరేషన్ లిమిటెడ్ (ఏఎంఆర్‌సీఎల్) ద్వారా మొదటి దశ పనులకు టెండర్లను ఆహ్వానించింది. అమరావతి మెట్రోతో పాటు విశాఖ మెట్రోను కూడా కలిపి టెండర్లను ఆహ్వానించారు. అయితే ఇవి పెద్ద మొత్తాలతో కూడినవి కావడంతో సింగిల్ బిడ్డర్ చేయడం కష్టమని, కొన్ని భాగాలు చేసి టెండర్లను పిలిస్తే బాగుంటుందని పలు సంస్థలు సూచించాయి. దీంతో టెండర్ల దాఖలుకు గడువు పెంచారు. అక్టోబరు ఏడో తేదీవరకు సమయం ఇచ్చారు. ఈలోగా ప్రీ బిడ్డింగ్ సమావేశం ఈనెల 19న నిర్వహించాలని నిర్ణయించారు. విశాఖ ప్రాజెక్టును ఎన్ని భాగాలుగా విభజించాలనే దానిపై ఈ సమావేశంలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్టు అధికార వర్గాల సమాచారం.

20 కి.మీ. పొడవున డబుల్ డెక్కర్ విధానం

విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టును మొదటి దశ కింద 46 కి.మీ. పొడవున నిర్మించాలని నిర్ణయించారు. ఇందులో 20 కి.మీ. డబుల్ డెక్కర్ మోడల్, మిగిలిన 26 కి.మీ. మెట్రో రైలు. నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం డబుల్ డెక్కర్ విధానం ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. ఇందులో సింగిల్ పిల్లర్‌పై రెండు కారిడార్లు ఒక దానిపై మరొకటి వస్తాయి. కింద కారిడార్‌లో వాహనాలు ప్రయాణించడానికి, పై కారిడార్‌లో మెట్రో రైలు నడపడానికి ఏర్పాట్లు ఉంటాయి. ఇందులో డబుల్ డెక్కర్ మళ్లీ రెండు భాగాలుగా ఉంటుందని అధికార వర్గాల సమాచారం. కొమ్మాది జంక్షన్ నుంచి తాటిచెట్లపాలెం వరకు 15 కి.మీ. ఒక విభాగంగా, స్టీల్ ప్లాంటు ప్రవేశ ద్వారం నుంచి గాజువాక వరకు 5 కి.మీ. రెండో విభాగంగాను నిర్మిస్తారని సమాచారం. మొదటి ... మిగతా 6వ పేజీలో

శుద్ధి చేసిన మురుగు నీటితో సంపద సృష్టి

పరిశ్రమలకు ప్రతిరోజూ 67 ఎంఎల్‌డీ విక్రయం

- కిలోలీటర్ రూ.60
- భవిష్యత్తులో 210 ఎంఎల్‌డీ నీటిని విక్రయించాలని లక్ష్యం
- కొచ్చిలో జరిగిన కాన్‌క్లేవ్‌లో ప్రజెంటేషన్
- సూరత్ తరహాలో భవన నిర్మాణ వ్యర్థాల ప్లాంటు నిర్వహణ
- జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

విశాఖపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ పరిధిలో జరుగుతున్న మురుగునీటి నిర్వహణ, శుద్ధి ప్రక్రియ పట్ల దేశంలోని ప్రధాన పట్టణ సంస్థలు ఆసక్తి కనబరిచినట్టు జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. పట్టణాభివృద్ధి, స్థానిక సంస్థల పాలన మెరుగుపరిచేందుకు, అభిప్రాయాలను పరస్పరం మార్పిడి చేసుకునేందుకు వీలుగా కేంద్ర గృహ, పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కేరళ రాజధాని కొచ్చిలో ఈనెల 12, 13 తేదీల్లో 'కేరళ కాన్‌క్లేవ్' పేరుతో సదస్సు నిర్వహించారు. ఆ సదస్సులో పాల్గొన్న కమిషనర్ కేతన్‌గార్గ్ సోమవారం నగరానికి తిరిగి వచ్చారు. సదస్సుకు సంబంధించిన ముఖ్యాంశాలను 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి వివరించారు.



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

కొచ్చిలో జరిగిన కాన్‌క్లేవ్‌కు దేశంలోని పది రాష్ట్రాల నుంచి 30 నగరాలకు చెందిన కమిషనర్లు, మేయర్లతోపాటు ఆయా రాష్ట్రాలకు చెందిన మంత్రులు హాజరైనట్టు కేతన్‌గార్గ్ తెలిపారు. ఈ సందర్భంగా నగరంలో మురుగునీటి నిర్వహణ, శుద్ధికి జీవీఎంసీ తీసుకుంటున్న చర్యలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించామన్నారు. నగరంలో ఇప్పటికే 1.2 లక్షల నివాసాలకు యూజీడీ సదుపాయం కల్పించామని, త్వరలో రూ.498 కోట్లతో మధురవాడ ప్రాంతంలో కొత్తగా యూజీడీ నెట్‌వర్క్ అభివృద్ధి, మరో రూ.56 కోట్లతో ఇప్పటికే యూజీడీ నెట్‌వర్క్ ఉన్న ప్రాంతాల్లో గ్యాప్‌లను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పడం జరిగిందన్నారు. ఆ మురుగునీటిని యూజీడీ నెట్‌వర్క్ నుంచి పంప్‌హౌస్‌లకు, అక్కడి నుంచి సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లకు తరలించడం, అక్కడ మురుగునీటిని శుద్ధి చేయడం గురించి వివరించానన్నారు. అలాగే ఎస్‌టీపీల్లో శుద్ధి చేసిన నీటిని సముద్రంలోకి విడిచిపెట్టేయకుండా, నగరంలో మొక్కలు, పచ్చదనం పెంపునకు వినియోగిస్తుండడంపై ... మిగతా 6వ పేజీలో

హోటల్ ఫుడ్‌లో రంగులు, రసాయనాలు

- పరీక్షల్లో నిర్ధారణ
- గత నెలలో ఆహార భద్రత, ప్రమాణాల శాఖ తనిఖీలు
- 81 నమూనాలు సేకరించి పరీక్షలకు పంపిన అధికారులు
- పదిహేను నమూనాల్లో హానికర రంగులు...
- మరో 14 నమూనాల్లో నాణ్యత తక్కువ...
- కేసులు నమోదు చేయనున్నట్టు అధికారుల వెల్లడి



హోటల్‌లో నిల్వ ఆహారం (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని అనేక హోటళ్లు ఆహార పదార్థాల తయారీలో ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే రంగులు, రసాయనాలను వినియోగిస్తున్నాయి. ఈ విషయం పరీక్షల్లోనే నిర్ధారణ అయ్యింది. గత నెల ఆహార భద్రత, ప్రమాణాల శాఖ, తూనికలు కొలతలు శాఖ అధికారులు సంయుక్తంగా పలు హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, స్వీట్ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాణ్యత లేని, రోజుల తరబడి నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను గుర్తించి వాటి నమూనాలను (మొత్తం 81) సేకరించి పరీక్షల నిమిత్తం హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించారు. ఆ పరీక్షల ఫలితాలు అధికారులకు అందాయి. మొత్తం 81 నమూనాల్లో ఇరవై తొమ్మిదింటిలో తేడాలు ఉన్నట్టు తేలింది. అందులో 15 నమూనాల్లో ప్రజల ఆరోగ్యానికి హాని చేకూర్చే రసాయనాలు, రంగులు వినియోగించినట్టు తేలింది. ఇందులో చికెన్ బిర్యానీ, మటన్ బిర్యానీ, ఫిష్ ఐటమ్స్ ఉన్నాయి. వీటిలో ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే కొన్నిరకాల రంగులను అధికంగా వినియోగించినట్టు ఫలితాల్లో తేలింది. అలాగే, మరో 14 నమూనాల్లో నాణ్యత ప్రమాణాలు తక్కువ ఉన్నట్టు వెల్లడైంది. వీటిలో బెల్లం, ఐస్‌క్రీమ్‌లు, స్వీట్లు, జీడి పప్పు పొడి, కేకులు ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. ఇందుకు సంబంధించి హోటల్స్, రెస్టారెంట్లు, స్వీట్స్, బేకరీల యజమానులకు 46 (4) కింద నోటీసులు ఇచ్చినట్టు జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఎస్.కల్యాణచక్రవర్తి తెలిపారు. 30 రోజుల్లో కొంత మొత్తం డీడీ చెల్లించి మరోసారి పరీక్షలు చేయించుకునే అవకాశం వారికి అందిస్తామన్నారు. మరోసారి పరీక్షలకు ముందుకు రాకపోతే ఇప్పుడు వచ్చిన ఫలితాలను ఫైనల్‌గా నిర్ధారించి కేసులు నమోదు చేయనున్నట్టు వెల్లడించారు. ఆరోగ్యానికి హానికరంగా తేలిన 15 నమూనాలకు సంబంధించిన హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులపై కోర్టుల్లో క్రిమినల్ కేసులు పెడతామని, నాణ్యత తక్కువగా ఉన్నట్టు నిర్ధారణ అయిన వాటిపై జాయింట్ కలెక్టర్ కోర్టుల్లో కేసులు నమోదు చేయనున్నట్టు తెలిపారు. హోటళ్లు, రెస్టారెంట్స్ నిల్వ ఉంచిన ఆహారాన్ని వేడి చేసి ప్రజలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బేకరీలు, స్వీట్స్ దుకాణ యజమానులు కూడా ప్రమాణాలు పాటించాలన్నారు.

ఆర్టీసీ అధికారుల ఉక్కిరిబిక్కిరి

'స్త్రీశక్తి' అమలు తరువాత విపరీతంగా పెరిగిన ప్రయాణికులు

- రీజియన్‌లో గతంలో సగటున రోజుకు 3.1 లక్షల మంది ప్రయాణం
- ప్రస్తుతం 4.1 లక్షల మంది...
- పెరిగిన ఆ లక్ష మంది మహిళలే
- డిమాండ్‌కు తగ్గట్టు బస్సులు ఏర్పాటుచేయలేక సతమతం
- తక్షణం 170 బస్సులు కేటాయించాల్సిందిగా ప్రధాన కార్యాలయానికి ఆర్‌ఎం లేఖ



ఆర్టీసీ బస్సులో కిక్కిరిసిన మహిళలు

ద్వారకా బస్‌స్టేషన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి):

'స్త్రీశక్తి' పథకం ప్రారంభమైన తరువాత విశాఖ రీజియన్‌లో ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరిగింది. వారి అవసరాలకు అనుగుణంగా బస్సుల నడపడం అధికారులకు సవాల్ మారింది. ఏరోజు, ఏ సమయంలో, ఏ రూట్‌లో ఎంత డిమాండ్ ఉంటుందో అంచనా వేయలేని పరిస్థితి నెలకొంది.

సాధారణ రోజుల ఉంటే వారాంతాలు, పర్వదినాల్లోను, మంచి ముహూర్తాలు ఉన్న రోజుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య మరీ ఎక్కువగా ఉంటుంది. స్త్రీశక్తి పథకం అమలుకు ముందు రీజియన్‌లో గల ఆర్టీసీ బస్సుల్లో సగటున రోజుకు 3.1 లక్షల మంది ప్రయాణించేవారు. పథకం అమలు తరువాత ప్రస్తుతం రోజుకు 4.1 లక్షల మంది ప్రయాణిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. పెరిగిన ఆ లక్ష మందీ కూడా మహిళలేనని అంటున్నారు. స్త్రీశక్తి పథకం అమలుకు ముందు రీజియన్‌లో 780 బస్సులు ఉండేవి. అయితే జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కింద గతంలో కొనుగోలు చేసిన బస్సు రెండు వారాల కిందట జాతీయ రహదారిపై దగ్ధం కావడంతో... ఆ కేటగిరీకి చెందిన మొత్తం 18 బస్సులను తాత్కాలికంగా నిలిపివేశారు. దీంతో బస్సుల సంఖ్య తగ్గింది. ఇదే సమయంలో ప్రయాణికుల ... మిగతా 6వ పేజీలో

ఉపాధ్యాయ ఎంపిక జాబితా విడుదల

- ఉమ్మడి విశాఖ జిల్లాలో 1,139 పోస్టులకు 1,134 భర్తీ
- 19న విజయవాడలో నియామక పత్రాలు అందజేత

విశాఖపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఉపాధ్యాయ నియామక ప్రక్రియ పూర్తయ్యింది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 1,139 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా, 1,134 పోస్టులు భర్తీ అయ్యాయి. జిల్లా పరిషత్, ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో గల ఇతర పాఠశాలల్లో 625 పోస్టులకు 621, మునిసిపాలిటీల్లో 109 పోస్టులకు 108, గిరిజన సంక్షేమ శాఖలో 400 పోస్టులకు 400, జువెనైల్ వెల్ఫేర్‌లో ఐదు పోస్టులకుగాను ఐదూ భర్తీ అయ్యాయి. జిల్లా పరిషత్, ప్రభుత్వ, మునిసిపాలిటీల్లో ఎస్‌జీటీ ఉర్దూకు అభ్యర్థులు లేకపోవడంతో ఐదు పోస్టులు ఖాళీగా మిగిలిపోయాయి. జిల్లాల వారీగా ఎంపికైన అభ్యర్థుల వివరాలను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఆన్‌లైన్‌లో విడుదల చేసింది. దీని ప్రకారం విశాఖ జిల్లాలో ప్రభుత్వ, జిల్లా పరిషత్ యాజమాన్య పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో తెలుగు 24, ఇంగ్లీష్ 52, హిందీ 28, గణితం 57, ఫిజికల్ సైన్స్ 36, బయాలజీ 52, సోషల్ స్టడీస్ 88, ఎస్‌జీటీ తెలుగు 139 పోస్టులు భర్తీ అయ్యాయి. ఎస్‌జీటీ ఉర్దూలో పదికి ఆరు పోస్టులు మాత్రమే భర్తీచేశారు. అలాగే మునిసిపాలిటీల్లో స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో తెలుగులో రెండు, ఇంగ్లీష్‌లో మూడు, గణితంలో రెండు, ఫిజికల్ సైన్స్‌లో మూడు, బయాలజీలో ఆరు, సోషల్ స్టడీస్‌లో మూడు, ఎస్‌జీటీ తెలుగులో 87 పోస్టులు, ఉర్దూలో మూడు పోస్టులకుగాను రెండు భర్తీచేశారు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో తెలుగు ఏడు, హిందీ 11, గణితం ఏడు, ఫిజికల్ సైన్స్ 35, సోషల్ సైన్స్ ఐదు, ఎస్‌జీటీ తెలుగు 335 పోస్టులు భర్తీ అయ్యాయి. జువెనైల్ వెల్ఫేర్‌లో ఎస్‌జీటీ తెలుగు నాలుగు, పీఈటీ ఒక పోస్టు భర్తీ చేశారు.

ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 19న వెలగపూడిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా నియామక పత్రాలు ... మిగతా 6వ పేజీలో

సీఐల బదిలీ

విశాఖపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో కొందరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ సీపీ శంఖబ్రతబాగ్చి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఎంవీపీ స్టేషన్ సీఐగా పనిచేస్తున్న జె.మురళీని విశాఖ రేంజ్‌కు, వెస్ట్‌జోన్ క్రైమ్ సీఐగా పనిచేస్తున్న ఎన్.శ్రీనివాస్‌ను రేంజ్ వీఆర్‌కు సరండర్ చేశారు. ద్వారకా ట్రాఫిక్ సీఐగా పనిచేస్తున్న కేఎన్‌ఎస్‌వీ ప్రసాద్‌ను ఎంవీపీ సీఐగా బదిలీ చేశారు. కంట్రోల్ రూమ్‌లో సీఐగా పనిచేస్తున్న ఎస్‌వీ ప్రభాకర్‌రావును ద్వారకా ట్రాఫిక్ సీఐగా బదిలీచేశారు. సిటీ వీఆర్-2లో ఉన్న మీసాల చంద్రమౌళిని వెస్ట్‌జోన్ క్రైమ్ సీఐగా బదిలీ చేశారు. సిటీ వీఆర్-1 సీఐగా పనిచేస్తున్న బి.భాస్కరరావును పోలీస్ కంట్రోల్‌రూమ్‌కు బదిలీ చేశారు.

వేతనాల కోసం ఉక్కు ఉద్యోగుల ఆందోళన

కుటుంబ సభ్యులతో కలిసి నిరసన

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తక్షణమే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్టీల్ ప్లాంటు కార్మికులు కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఖాళీ కంచాలు ప్రదర్శిస్తూ...వెంటనే జీతాలు ఇవ్వాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ ఉక్కు ఉద్యోగులకు జీతాలు చెల్లించామని కేంద్ర మంత్రి చెప్పడం అత్యంత దుర్మార్గమన్నారు. కార్మికులకు గత ఏడాది కాలంగా సరిగ్గా జీతాలు ఇవ్వడం లేదన్నారు. జీతాల కోసం అడిగిన కార్మిక నాయకులకు ... మిగతా 6వ పేజీలో



ఆందోళన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరాం

భయపెడుతున్న బ్రెయిన్ స్ట్రోక్



- ఇటీవల గణనీయంగా పెరుగుతున్న కేసులు
- యువతలోనూ వెలుగుచూస్తున్న సమస్య
- కేజీహెచ్‌కు ప్రతిరోజూ 30 మంది బాధితులు

బ్రెయిన్‌స్ట్రోక్ బాధితుల సంఖ్య పెరుగుతోంది. సాధారణంగా 50 ఏళ్లు దాటిన వారిలో కనిపించే ఈ రుగ్మత ఇప్పుడు 30 ఏళ్ల లోపు వారిలోనూ వెలుగుచూస్తోంది. దీనిని సకాలంలో గుర్తించకుంటే ప్రమాదమని, లక్షణాలను బట్టి మేల్కొంటే ప్రాణాపాయం తప్పుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

- వివరాలు 8లో

తాటితూరు హిందీ ఉపాధ్యాయుడికి అవార్డు

భీమునిపట్నం (రూరల్), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాటితూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు టీఎస్వీ ప్రసాదరావుకు విశాఖ గ్రీన్ సిటీ, జేసీఐ స్వచ్ఛంద సంస్థ ఉత్తమ హిందీ ప్రచారక్ అవార్డు అందజేసింది. సోమవారం విశాఖలో జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్షురాలు సునీతారెడ్డి ఈ అవార్డును ప్రదానం చేశారు. తొమ్మిదేళ్లుగా ప్రసాదరావు హిందీ భాషాభివృద్ధికి చేస్తున్న కృషిని గుర్తిస్తూ ఈ అవార్డు ఇచ్చారు.

అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలి : సీపీఐ

తగరపువలస, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : భీమిలి, తగరపువలస పరిధిలో అర్హులైన ప్రతిఒక్కరికి పింఛన్లు ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు స్థానిక జీఆర్ భవన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జోన్ కార్యదర్శి కానూరి రాంబాబు మాట్లాడుతూ కరోనా తరువాత అర్హులైన ఎంతోమంది వృద్ధులు, వితంతువులు, వికలాంగులు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నా.. మంజూరు చేయడం లేదన్నారు. పాత పింఛన్లనే కొనసాగిస్తున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారని, కానీ ఒక్క కొత్త పింఛన్ కూడా ఇవ్వలేదన్నారు. కొత్త పింఛన్ల కోసం గ్రామ సచివాలయాల్లో వందలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఎమ్మెల్యే గంటా అర్హులందరికీ పింఛన్లు మంజూరయ్యేలా చూడాలని కోరారు. లేకపోతే సీపీఐ తరఫున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు మోర అప్పలరాజు, నూలు ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన


విద్యార్థినులకు యాప్ గురించి వివరిస్తున్న ఎస్ఐ సుశీల

తగరపువలస, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మహిళలు, విద్యార్థినులు శక్తి యాప్ గురించి అవగాహన పెంచుకోవాలని మహిళా ఎస్ఐ పి. సుశీల అన్నారు. సోమవారం నార్త్ సబ్ డివిజన్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో తగరపువలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులకు శక్తి యాప్ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, బాలికల రక్షణ కోసం ప్రభుత్వం ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఈ యాప్ ఫోన్‌లో ఉంటే ఎటువంటి ఆపదలో ఉన్నా రక్షించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఎవరి ఫోన్ నుంచి కాల్ వచ్చింది, లొకేషన్, ఇతర వివరాలన్నీ తెలిసిన వెంటనే పోలీసులు అప్రమత్తం అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. శ్రీవాణి, సిబ్బంది జగదీశ్, బి. శివ, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారం రోడ్ల తవ్వకం


ఎండాడ ప్రభుత్వ పాఠశాల వద్ద రోడ్డును తవ్వుతున్న దృశ్యం

ఎండాడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డు పరిధిలో కొందరు స్థానికులు సొంత అవసరాల కోసం జీవీఎంసీ రోడ్లను ధ్వంసం చేస్తున్నారు.భవన నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో జీవీఎంసీ వేసిన కాంక్రీట్, బీటీ రోడ్లను ఇష్టానుసారం తవ్వేస్తున్నారు. తాగునీటి సరఫరా పైపులైన్లు, ఇళ్లల్లో నుంచి వెళ్లే వృథా నీటిని తరలించేందుకు ఈ తవ్వకాలు చేపడుతున్నారు. కనీసం అధికారుల అనుమతి కూడా తీసుకోవడం లేదు, రాకపోకలను ఆపి మరీ రోడ్లను తవ్వేస్తున్నారు. తమ పని అయ్యాక తూతూమంత్రంగా పూడుస్తున్నారు. దీంతో వేసిన గంటలోనే అక్కడ పెద్ద గొయ్యి ఏర్పడి అటువైపు వెళ్లే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం


విద్యార్థికి నగదు అందజేస్తున్న అప్పలస్వామి

సింహాచలం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డు ఎస్ఎన్ఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో నివాసం ఉంటున్న పదో తరగతి విద్యార్థి గొర్లి ఎర్నిసాయిగణేశ్‌కు కర్రి అప్పలస్వామి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు, అడివివరం సహకార పరపతి సంఘం పాలక మండలి అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి సోమవారం రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ మొత్తంతో నోట్ పుస్తకాలు కొనుగోలు చేసుకోవాలని ఆయన విద్యార్థికి సూచించారు. కార్యక్రమంలో సొసైటీ పాలక మండలి సభ్యుడు బోర ప్రసాద్, దాముర్జు రాజు, దొంతల అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

గాయత్రి విద్యా పరిషత్‌లో ముగిసిన సదస్సు

సాగర్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రుషికొండలో ఉన్న గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ, పిజి ఇంజనీరింగ్ కళాశాలలో అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ మెథడాలజీపై మూడు రోజులుగా జరుగుతున్న జాతీయ స్థాయి సదస్సు సోమవారంతో ముగిసింది. చివరి రోజు సదస్సుకు ఏయూ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎంవీఆర్ రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జీవీపీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్లు బోస్, ఎస్. రజని, ఎంఎస్ఆర్ శేషగిరి, డాక్టర్ ఎన్. విజయజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రినాథుడికి వైభవంగా నిత్య కల్యాణం

సింహాచలం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం సోమవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని, ఉభయదేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

భావ ఆయుర్వేద ఉచిత వైద్య శిబిరం

భీమునిపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జగన్నాథస్వామి ఆలయం వద్ద ప్రతి సోమవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు మంగమారిపేట వారిజ ఆశ్రమంలో ఉన్న భావ ఆయుర్వేద కేంద్రం వైద్యురాలు కె. మౌనిక తెలిపారు. ఈమేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి సోమవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1 వరకు శిబిరం జరుగుతుందన్నారు. 16 ఏళ్ల లోపు పిల్లలకు స్వర్ణామృత ప్రాసన ఔషధం అందిస్తామని చెప్పారు.


తుప్పలు, డొంకలతో నిండిపోయిన కాలనీలోని నివాసాలు


కాలనీలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లు

నిరుపయోగంగా కాలనీ ఇళ్లు

- కొత్తపేటలో 15 ఏళ్ల క్రితం నిర్మాణం
- 110 మంది పేదలకు కేటాయింపు
- కనీస సౌకర్యాల లేమి, పరిశ్రమల కాలుష్యంతో నివాసాలు ఖాళీ

భీమునిపట్నం (రూరల్), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్నవరం పంచాయతీ కొత్తపేట గ్రామంలో 15 ఏళ్ల క్రితం నిర్మించిన కాలనీ ఇళ్లు నిరుపయోగంగా ఉన్నాయి. పంచాయతీ పరిధిలోని అన్నవరం, ఎర్రయ్యపాలెం, కొత్తపేట గ్రామాలకు చెందిన వారికి ఈ కాలనీని కేటాయించారు. ఈమేరకు 110 మంది నిరుపేదలకు 2010లో ప్రభుత్వం ఇళ్లు నిర్మించింది. మూడు ఎకరాల విస్తీర్ణంలో ఈ నిర్మాణాలు జరిగాయి. కాలనీలో కనీస సౌకర్యాల లేమి, పరిశ్రమల కాలుష్యం వల్ల లబ్ధిదారులు నివాసాలను ఖాళీ చేసి, స్వస్థలాలకు వెళ్లిపోయారు. కొంతమంది గృహ నిర్మాణాలు పూర్తి చేసినప్పటికీ వాటిలో దిగలేదు. మరికొందరు దిగినా.. కొద్దిరోజుల్లోనే ఖాళీ చేసేశారు. దీంతో కాలనీ ఇళ్ల కోసం ప్రభుత్వం వెచ్చించిన ధనమంతా వృథా అయ్యింది. కాలనీలో ఇళ్లు పొందిన వారు కొత్తగా ఇళ్లు పొందడానికి అర్హత కోల్పోయారు.ప్రభుత్వం ముందు నిరుపేదలకు స్థలాలు కేటాయించి, తరు వాత గృహ నిర్మాణాలు చేపట్టింది. కాలనీవాసుల కోసం మూడు గొట్టపు బావులు కూడా నిర్మించారు. కొంతకాలం పాటు లబ్ధిదారుల్లో కొంత మంది కాలనీలో నివాసం ఉండగా తర్వాత మూఢ నమ్మకాలు, పరిశ్రమల కాలుష్యం వల్ల ఇళ్లను ఖాళీ చేసి అన్నవరం వద్ద తమ పాత ఇళ్లకు, బంధువుల ఇళ్లకు వెళిపోయారు. మరి కొందరు కాలనీలో ఉందామని ప్రయత్నించినప్పటికీ కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంతో వారు ఖాళీ చేసి, వెళ్లిపోయారు. దీంతో కాలనీ గృహాలు నిరుపయోగంగా మారాయి. కొన్ని నిర్మాణాలు పూర్తి కాగా మరికొన్ని నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. కాలనీలో లబ్ధిదారులుగా ఉన్నవారికి కొత్తగా ఇళ్ల మంజూరుకు అర్హత లేదు. అధికారులు రికార్డుల్లో వారు గృహాలు తీసుకున్నట్టుగా నమోదైంది. కాగా కాలనీ ఉన్న స్థలం ప్రస్తుతం కోట్లాది రూపాయలు పలుకుతోంది. ఆక్రమణదారుల కన్ను కాలనీ స్థలంపై పడకముందే ప్రభుత్వం స్పందించి కాలనీని వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.


జోన్-1 జడ్సీ కనక మహాలక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న స్థానికులు


భీమిలిలో ఆర్డీఓ సంగీత్ మాథూర్‌కు రైతుల వినతి

భీమిలిలో పీజీఆర్ఎస్‌కు 12 అర్జీలు

భీమునిపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 12 అర్జీలు అందాయి. జడ్సీ అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఈ కార్యక్రమం జరిగింది. పట్టణ ప్రణాళిక విభాగానికి 3, ఇంజనీరింగ్, ప్రజారోగ్యం విభాగాలకు నాలుగేసి చొప్పున, రెవెన్యూ విభాగానికి 1 అర్జీ అందింది.

ఆర్‌డీఓ కార్యాలయంలో...

రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 8 అర్జీలు అందినట్టు అధికారులు తెలిపారు. ఆర్డీవో సంగీత్ మాథూర్ ఆధ్వర్యంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటలవరకూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తాటితూరులో ఒక బాధితురాలు తన సొంత స్థలం ఆరుసెంట్లు ఉండగా, రికార్డుల్లో కేవలం సెంటు మాత్రమే ఉందని, పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో తెలిపారు.

దుర్గానగర్‌లోని సమస్యలపై వినతి

కొమ్మాది : జీవీఎంసీ ఏడో వార్డు దుర్గానగర్‌లో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని కోరుతూ ఆ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పిళ్లా సూరిబాబు, నాగబాబు జోన్-2 జడ్సీ కనకమహాలక్ష్మికి జోనల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలోని సమస్యలను పరిష్కరించడంతో పాటు చంద్రంపాలెం మెయిన్ రోడ్డును విస్తరించాలని విన్నవించారు. కాగా కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 17 వినతులు అందాయి. టౌన్ ప్లానింగ్ విభాగానికి 6, ఈఈ వర్క్సుకు 4, తాగునీటి సరఫరా విభాగానికి 2, విద్యుత్ విభాగానికి 1, పబ్లిక్ హెల్త్ విభాగానికి 3, యూసీడీ విభాగానికి 4 అర్జీలు వచ్చినట్టు జడ్సీ తెలిపారు. వాటిని ఆయా విభాగాలకు పంపించి, పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు.

సంప్రదాయబద్ధంగా శ్రీకృష్ణుడి జయంత్యుత్సవం

సింహాచలం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో శ్రీకృష్ణుడి జయంత్యుత్సవం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. సోమవారం సాయంత్రం 6 నుంచి భక్తులకు అప్పన్న దర్శనాలు నిలుపుదల చేసి రాత్రి ఆరాధన, దూపసేవ జరిపారు. అమ్మవారి ఉత్సవమూర్తిని నిండు గర్భిణి దేవకిగా అలంకారి సీతారామాచార్యులు అలంకరించిన తీరు ఆకట్టుకుంది. దేవకిని ప్రత్యేక పల్లకిలో ఉంచి బేడా మండపంలో తిరువీధి జరిపి మూలన ప్రత్యేక వేదికపై ఉంచారు. శ్రీకృష్ణుడు జన్మించినట్టుగా పిల్లల ఏడుపులా అర్చక స్వామి అనుకరించారు. అనంతరం భాగవతంలోని శ్రీకృష్ణ జనన ఘట్టాన్ని అధ్యాపకులు పఠనం చేశారు. పారాడే కృష్ణుడ్ని భక్తుల దర్శనార్థం ఉంచి ఆస్థాన మండపంలో విశేష వేదికపై ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయ దేవేరులు, ఆళ్వార్లను ఉంచారు. పండితులు వేదాలు, అధ్యాపకులు భాగవతంలోని శ్రీకృష్ణలీలలను పారాయణలు చేశారు. కార్యక్రమంలో స్థానాచార్యులు రాజగోపాల్, పర్యవేక్షణాధికారి సత్యశ్రీనివాస్ పాల్గొన్నారు.


ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి పూజలు నిర్వహిస్తున్న వైదికులు (ఇన్‌సెట్లో) బాల కృష్ణుడు



నృసింహవనంలో పూజలు

శ్రీకృష్ణుడి (వైష్ణవ) జయంతి పురస్కరించుకుని కృష్ణాపురంలోని నృసింహవనంలో గోవులకు పూజలు నిర్వహించారు. పండితులు కపిలవాయ్ నరసింహమూర్తి, సంతోష్‌శర్మ గణపతి పూజ, పుణ్యాహవచనములు జరిపి షోడశోపచారాలను కృష్ణునికి, గోవులకు సమర్పించారు. అనంతరం కృష్ణాష్టోత్తర శతనామావళితో పూజలు చేశారు. భక్తులు గోవులను పసుపు, కుంకుమతో పూజించి, ప్రత్యేకంగా తయారు చేయించిన గారెలు, దాణాలను తినిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షణాధికారి జీవీవీఎస్‌కే ప్రసాద్, డీఈఈ రామరాజు (హరి) పాల్గొన్నారు.

కొమ్మాది : అన్నంరాజునగర్‌లోని అష్టలక్ష్మీ దేవాలయంలో వైష్ణవ కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు చామర్తి శ్రీధరస్వామి వేకువజామున స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపి, తులసి, కదంబ పూలతో అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. మహిళలు సామూహిక పారాయణలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి దంపతులు పాల్గొన్నారు.


కొమ్మాది : కదంబ పూలతో అలంకరణ

ఉత్తమ ఉపాధ్యాయులకు అభినందనలు


ఉపాధ్యాయులను అభినందిస్తున్న ఆర్జేడీ విజయభాస్కర్

మధురవాడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గురు పూజోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు పొందిన జిల్లా ఉపాధ్యాయులను విద్యా శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ విజయభాస్కర్, డీఈఓ ప్రేమ్‌కుమార్ సోమవారం ఆయా కార్యాలయాల్లో వేర్వేరుగా అభినందించారు. జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు కుమారస్వామి, సుజాత, మోహన్‌రావు ఈనెల 5న రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందారు. ఈమేరకు ఆర్‌జేడీ, డీఈఓ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీయూ నాయకుడు ఈ. పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

గీతంలో ఘనంగా ఇంజనీర్స్ డే

సాగర్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 165వ జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత యూనివర్సిటీ ఆవరణలో ఉన్న విశ్వేశ్వరయ్య విగ్రహానికి వీసీ ప్రొఫెసర్ ఎర్రోల్ డిసౌజా, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె. నాగేంద్రప్రసాద్, కంప్యూటర్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ ఎస్. అరుణ్‌కుమార్, సివిల్ ఇంజనీరింగ్ విభా గం అధిపతి ప్రొఫెసర్ ముకుంద్ పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ నేటితరం యువ ఇంజనీర్లు జాతి నిర్మాణంలో పాలు పంచుకోవాలని, ఆర్థిక ప్రగతిలో భాగస్వాములు కావాలన్నారు.

అప్పన్న సన్నిధిలో వీఎంఆర్‌డీఏ కమిషనర్



సింహాచలం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె. విశ్వనాథన్ సతీసమేతంగా సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ పర్యవేక్షణాధికారి కె. వెంకటేశ్వరరావు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న కమిషనర్ గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు.

బస్సులు నిలుపుదల చేయాలని ఆందోళన


రోడ్డుపై ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

ఆనందపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : చిన్నయ్యపాలెంలో బస్టాప్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నయ్యపాలెం వద్ద బస్టాప్ లేకపోవడంతో ఇచ్చాపురం, మణ్యం గ్రామాలకు చేరుకోవాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. ఆయా గ్రామాలకు వెళ్లాలంటే బాకురుపాలెం లేదా రేగాణిగూడెం వద్ద దిగి మళ్లీ ఆటో ఎక్కి ఇళ్లకు చేరుకోవాల్సి వస్తుందన్నారు. బాకురుపాలెం నుంచి చిన్నయ్యపాలెం మీదుగా రేగానిగూడెం వరకు బస్సులు నడుస్తున్నాయని, కానీ చిన్నయ్యపాలెం వద్ద స్టాప్ లేకపోవడంతో ఆపడం లేదన్నారు. ఈమేరకు రోడ్డుపై బైఠాయించి రెండు గంటల పాటు ఆందోళన చేశారు. ఆర్టీసీ అధికారులు బస్టాప్ కేటాయిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

శుద్ధి చేసిన మురుగు నీటితో సంపద సృష్టి

... 5వ పేజీ తరువాయి

వీడియోలను ప్రదర్శించామన్నారు. మురుగునీటిని శుద్ధి చేయడానికి భారీగా ఖర్చు చేస్తున్నామని, ఆదాయం సమకూర్చుకోవడం కోసం శుద్ధి చేసిన నీటిని పరిశ్రమలకు విక్రయించడం ప్రారంభించగా, వారి నుంచి డిమాండ్ పెరుగుతోందని వివరించామన్నారు. ప్రస్తుతం శుద్ధి చేసిన మురుగునీటిని కిలోలీటర్ రూ.60 చొప్పున ప్రతీరోజూ 67 ఎంఎల్‌డీ విక్రయిస్తున్నామని, భవిష్యత్తులో 210 ఎంఎల్‌డీ నీటిని విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకున్నందున దానికి సంబంధించిన ప్రణాళికలను వివరించానన్నారు. దీనికి అందరి నుంచి మంచి స్పందన లభించడంతోపాటు ఆయా నగరాల్లో కూడా దీనిని అమలుచేసే మార్గాలపై దృష్టిసారిస్తామని తనతో పేర్కొన్నారన్నారు. మరోవైపు సూరత్ మోడల్‌లో నగరంలో భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణకు సంబంధించి కనస్ట్రక్షన్ అండ్ డిమాలిస్డ్ వేస్ట్ (సీ అండ్ డీ) ప్లాంటును నిర్వహించాలని నిర్ణయించామన్నారు. జీవీఎంసీలో సీ అండ్ డీ ప్లాంటు నిర్వహణకు జీవీఎంసీయే కాంట్రాక్టర్‌కు డబ్బులు చెల్లిస్తుండగా, సూరత్‌లో డెవలపరే అక్కడి కార్పొరేషన్‌కు డబ్బులు కడుతుండడం తనను ఆకట్టుకుందన్నారు. శిధిల భవనాలు, పాత భవనాలను ఎవరైనా కూల్చివేసి దాని స్థానంలో కొత్తనిర్మాణం చేపట్టాలంటే ముందుగా నగర పాలక సంస్థ అనుమతి కోసం దరఖాస్తు చేస్తారన్నారు.ఆ సమయంలోనే డెబ్రిస్‌ను యార్డుకు తరలించడానికి అయ్యే ఖర్చును భవన యజమాని నుంచి వసూలుచేస్తున్నారన్నారు.ఆ డెబ్రిస్‌ను కాంట్రాక్టర్ (డెవలపర్) యార్డుకు తీసుకువెళ్లి అక్కడ టైల్స్, సిమెంట్ ఇటుకలు తయారుచేసి విక్రయించుకుంటున్నారన్నారు.దీనివల్ల అక్కడి కార్పొరేషన్‌పై ఆర్థిక భారం పడకుండా, తిరిగి ఆదాయం చేరుతోందన్నారు. అదే మోడల్‌ను త్వరలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఆర్టీసీ అధికారుల ఉక్కిరిబిక్కిరి

... 5వ పేజీ తరువాయి

సంఖ్య పెరిగింది. దీంతో ట్రాఫిక్ నియంత్రణ ఆర్టీసీ అధికారులకు కత్తిమీద సాములా తయారయ్యింది. ఈ నేపథ్యంలో ప్రయాణ సమయం మార్చుకోవాలని ఆర్టీసీ అధికారులు కోరుతున్నారు. మరోవైపు విశాఖ రీజియన్‌కు కనీసం 170 బస్సులు సత్వరమే పంపాలని ప్రధాన కార్యాలయానికి రీజనల్ మేనేజర్ లేఖ రాశారు. ప్రతిరోజూ ఉదయం 7.00 నుంచి 10.00 గంటలు, సాయంత్రం 4.00 నుంచి రాత్రి 7.00 మధ్య 1.6 లక్షల మంది విద్యార్థులు (పాస్‌లు తీసుకున్న సంఖ్య) ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. ఇదే సమయంలో ఉద్యోగాలకు, వ్యాపారాలకు, ఇతర వ్యవహారాలకు సంబంధించి పురుషులు, మహిళలు మరో లక్షన్నర మంది ప్రయాణిస్తున్నారు. స్త్రీశక్తి పథకం అమలు తరువాత పెరిగిన లక్ష మంది ప్రయాణికుల్లో ఎక్కువ మంది అవే సమయాల్లో ప్రయాణాలు చేస్తున్నారు. ప్రయాణికుల సంఖ్యకు తగ్గట్టుగా బస్సులు సమకూర్చడం అధికారులకు అసాధ్యమవుతున్నది. ద్వారకా బస్‌స్టేషన్, మద్దిలపాలెం, సింహాచలం, ఎంవీపీ కాలనీ బస్ స్టేషన్‌ల్లో ప్రయాణికులు బస్సుల కోసం గంటల సమయం వేచి ఉండాల్సిన పరిస్థితి వచ్చింది.

అధికారులపై పెరుగుతున్న ఒత్తిడి

కాంప్లెక్స్‌లో గంట నుంచి ఉంటున్నా బస్సులు రాలేదని, ఎప్పుడో వచ్చిన బస్సు ఎక్కేందుకు ఒకరినొకరు నెట్టుకోవలసి వస్తోందని ఆర్టీసీ అధికారులను మహిళలు ఫిర్యాదులు చేస్తున్నారు. వేరే రూట్‌ల నుంచి బస్సులు రప్పించాలని యత్నించినా అక్కడా ఇదే పరిస్థితి. బస్సుల కోసం ఆర్టీసీ అధికారులపై ఒత్తిడి పెరుగుతున్నది.

మెట్రో టెండర్లలో మార్పు

... 5వ పేజీ తరువాయి

దశ ప్రాజెక్టు రూ.11,498 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఇందులో డబుల్ డెక్కర్ చేరడంతో అదనంగా మరో రూ.2,000 కోట్లు అవసరమని భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు మొత్తం 99.75 ఎకరాలు అవసరమని నిర్ధారించారు. అందులో సుమారు పది ఎకరాలు ప్రైవేటు భూమి ఉంది. ఆ భూ సేకరణకు మరో రూ.882 కోట్లు అవసరమని గతంలోనే లెక్కలు వేశారు. అంటే మొత్తంగా చూసుకుంటే తొలిదశ నిర్మాణానికి రూ.14,380 కోట్లు అవసరం. ఇందులో ప్రస్తుత ప్రణాళిక ప్రకారం 60 శాతం నిధులు పీపీపీ విధానంలో సేకరించి, మిగిలిన 40 శాతం నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా పెట్టుకోవాలనే ప్రాతిపదికన ఫైల్ నడుపుతున్నారు. ఈ నెల 19న జరిగే సమావేశంలో మొదటి దశ పనులు ఎన్ని భాగాలుగా చేసి కాంట్రాక్టర్లకు అప్పగిస్తారనే అంశంపై స్పష్టత వస్తుంది. అప్పుడే ఇది ముందుకు కదులుతుంది.

సర్వీస్ రంగంలో విశాఖకు ఏ+

... 5వ పేజీ తరువాయి

స్వర్ణాంధ్రలో 63 పాయింట్లతో బి గ్రేడ్ సాధించింది. వ్యవసాయ రంగంలో 26 ప్లాయింట్లతో 'సి' గ్రేడ్‌కు పరిమితమైంది. ఏడాదికి రూ.6,791 కోట్లు లక్ష్యం ఇవ్వగా, తొలి క్వార్టర్‌లో కేవలం రూ.749 కోట్లు సాధించింది. పరిశ్రమల రంగంలో 63 పాయింట్లతో 'బి' గ్రేడ్ దక్కించుకుంది. జిల్లాకు రూ.59,535 కోట్లు లక్ష్యం ఇవ్వగా తొలి క్వార్టర్‌లో రూ.8,030 కోట్లతో 13.49 శాతం సాధించింది. కాగా, విశాఖపట్నంలో పర్యాటక అభివృద్ధికి ఒకేచోట 50 ఎకరాలు సేకరించామని పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి అజయ్ జైన్ ఈ సందర్భంగా ప్రకటించారు.

ఉపాధ్యాయ ఎంపిక జాబితా విడుదల

... 5వ పేజీ తరువాయి

అందించనున్నారు. ఈ సందర్భంగా టాపర్లు కొందరికి మాట్లాడే అవకాశం ఇవ్వనుండడంతో జిల్లా నుంచి ఇద్దరు, ముగ్గురి పేర్లతో జాబితాను అధికారులు పంపించారు. నియామక పత్రాలు అందుకునేందుకు అభ్యర్థులు ఈ నెల 18న ఉదయం 7.30 గంటలకు ఉక్కు నగరంలోని విశాఖ విమల విద్యాలయం స్కూల్ నుంచి బస్సులో వెలగపూడికి బయలుదేరుతారు. మెగా డీఎస్సీకి సంబంధించి డీఈవో కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటుచేశారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ 94404 84917, 91772 92969, 96185 84051 నంబర్లకు ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చునని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రేమ్‌కుమార్ తెలిపారు.

వేతనాల కోసం ఉక్కు ఉద్యోగుల ఆందోళన

... 5వ పేజీ తరువాయి

షోకాజు నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. జీతాల విషయం లో స్థానిక ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకోవాలన్నారు. కార్యక్రమం లో నాయకులు వైటీ దాసు, యు.రామస్వామి, పి.శ్రీనివాసరాజు, కె.గంగాధర్, రాజు, పుల్లారావు, అప్పారావు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటక్ ఆధ్వర్యంలో....

జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఇంటక్ ఆధ్వర్యంలో బీసీ గేటు వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ జీతాల కోసం ప్రతి నెలా ఎదురు చూపులు తప్పడం లేదన్నారు. సంస్థ కోసం నిరంతరం శ్రమిస్తున్న కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పీవీ రమణమూర్తి, బీఎస్ రాజు, నీరుకొండ రామచంద్రరావు, కొమ్ము ప్రసాద్, వెంకన్న, ఈశ్వరరావు, పోతారెడ్డి, అవతారం పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తా : కార్పొరేటర్



పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య

వెంకోజీపాలెం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 15వ వార్డులో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య తెలిపారు. ఈమేరకు యూసీడీ ఏఈ రహీమ్‌తో కలిసి సోమవారం పలు ప్రాంతాల్లో పరిశీలించారు. పాత వెంకోజీపాలెం రామాలయం వద్ద పాడైన బోరుబావి స్థానంలో కొత్తది వేయాలని అధికారులకు సూచించారు కొత్త వెంకోజీపాలెం కొండవాలులోని పైపులైను మరమ్మతులను పరిశీలించారు. అనంతరం పాత వెంకోజీపాలెం ఉమానగర్, దుర్గానగర్ కొండవాలులోనూ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులను కొత్తవి అమర్చాలన్నారు. టీడీపీ నేతలు మళ్ల రవికుమార్, అప్పారి గిరిబాబు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

'వందేభారత్' రోజుల సవరణ

విశాఖపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖ నుంచి సికింద్రాబాద్ మధ్య నడుస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సర్వీసు (20707/20708) రోజులను సవరించామని సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ప్రస్తుతం వారంలో గురువారం మినహా మిగిలిన అన్ని రోజుల్లో అందుబాటులో ఉన్న 20707, 20708 నంబర్లు గల వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సర్వీసులు డిసెంబరు 2 నుంచి వారంలో సోమవారం మినహా మిగిలిన అన్ని రోజుల్లో అందుబాటులో ఉండేలా సవరించామని పేర్కొన్నారు. దీంతో ఈ సర్వీసులు డిసెంబరు 2 నుంచి ప్రతి సోమవారం అందుబాటులో ఉండవని స్పష్టం చేశారు. సవరించిన మార్పుల ద్వారా గురువారం అందుబాటులో ఉండేలా డిసెంబరు 2 నుంచి అమల్లోకి వస్తాయని తెలిపారు. ఈ మార్పులను ప్రయాణికులు గమనించాలని సూచించారు.

దేశం గర్వించదగ్గ ఇంజనీర్ విశ్వేశ్వరయ్య: ఏయూ వీసీ

విశాఖపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : దేశం గర్తించదగ్గ గొప్ప ఇంజనీర్‌గా మోక్షగుండం విశ్వేశ్వరయ్య నిలుస్తారని ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ అన్నారు. మోక్షగుండం జయంతి సందర్భంగా సోమవారం ఏయూలోని ఆయన విగ్రహానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. విశ్వేశ్వరయ్య సేవలను గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె .రాంబాబు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లానింగ్ అండ్‌మేనేజ్ మెంట్ డీన్ ఆచార్య కెశ్రీనివాసరావు, ఇంజనీర్ వి. తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **మిరాయి** : జగదాంబ, మెలోడి, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కిష్కింధపురి** : లీలామహల్, సంగం, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక),
- **అర్జున్ చక్రవర్తి** : రమాదేవి,
- **మదరాసి** : శ్రీకన్య
- **ఘాటీ** : కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : , శ్రీకన్య-2 (గాజువాక)
- **కూలీ** :వెంకటేశ్వర-1, అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 15, టమాటా 24, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 28, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 46, దొండకాయలు 38, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది) 70, బరబాటి 30, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 64, కీరదోస 32, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 32, చిలగడదుంపలు 35, కంద 40, దేముడుచిక్కుడు 76, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	130
లైవ్ ధర	150
విత్ స్కిన్	270
స్కిన్‌లెస్	280



తాత్కాలిక పనులు చేపడుతున్న దృశ్యం





కెరటాల ఉధృతికి ఆర్‌కే బీచ్‌లో రహదారి కొట్టుకుపోయిన వైనం, తీరంలో కోతకు గురైన ప్రాంతం

కోతకు గురవుతున్న తీరం

- కెరటాల ఉధృతికి నిర్మాణాలు ధ్వంసం
- పరిరక్షణకు వీఎంఆర్‌డీఏ చర్యలు
- రక్షణ గోడ నిర్మాణానికి ప్రతిపాదనలు

బీచ్ రోడ్డు, సెప్టెంబరు 15, (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతం తరచూ కోతకు గురవుతోంది. కెరటాల ఉధృతికి నిర్మాణాల కింద మట్టి కోసుకుపోతుండగా, పలు మార్లు రహదారులు ధ్వంసమవుతున్నాయి. బంగాళాఖాతంలో ఎప్పుడు అలజడి ఏర్పడినా సముద్ర తీరం కోతకు గురవుతోంది. భీమిలి నుంచి కోస్టల్ బ్యాటరీ వరకు తీర ప్రాంతాలు దెబ్బతింటున్నాయి. అలల తీవ్రతకు ఆర్కే బీచ్‌లో కొన్ని ప్రాంతాలు నేలమట్టమయిపోతున్నాయి. అకస్మాత్తుగా సముద్రంలో కలిసిపోతున్నాయి ఇదొక తీవ్ర సమస్యగా మారింది. అదేవిధంగా మత్స్యకార గ్రామాల్లో నివసించే ప్రజలకు ముప్పు వాటిల్లుతోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని అధికారులు యుద్ధప్రాతిపదికన నివారణ చర్యలు ప్రారంభించారు.

బిక్కుబిక్కుమంటూ జీవనం

జాలారిపేట ఫిషింగ్ హార్బర్ వద్ద నివసిస్తున్న మత్స్యకారులు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. అల్పపీడనాలు, తుఫాన్‌ల సమయంలో అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతుండడంతో వారిలో ఆందోళన నెలకొంటోంది. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని జీవిస్తున్నారు.

కొట్టుకుపోతున్న మట్టి

బీచ్‌రోడ్డులో కోస్టల్ బ్యాటరీ నుంచి వైఎంసీఏ కూడలి వరకు లోతట్టుగా ఉండడం వలన సమస్య ఎదురవుతోంది. ఇక్కడ రోడ్డు ఎత్తుగా ఉండడంతో పాటు రక్షణ గోడ ఉండడంతో తుపాన్లు వచ్చినా సమస్య ఉండేది కాదు. కానీ అలలు చొచ్చుకు వస్తుండడంతో ఎత్తైన గట్టు గోడ వద్ద ఉన్న ప్రాంతం కూరుకుపోతోంది. రక్షణ గోడ కింద భాగంలో మట్టి కొట్టుకుపోవడంతో గోడ కూలిపోయే పరిస్థితి ఎదురవుతోంది. ఈ నేపథ్యంలో కోత నివారణకు అడ్డుకట్ట వేసేందుకు వీఎంఆర్‌డీఏ రంగంలోకి దిగినట్టు సమాచారం. ఇందులో భాగంగా భారీ రక్షణ గోడ నిర్మాణానికి జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థతో కలిసి ప్రాజెక్టు తలపెట్టింది. దీనికి అనుమతి లభిస్తే సుమారు రూ.203 కోట్ల వ్యయంతో పూర్తిస్థాయి రక్షణ చర్యలు చేపట్టనుంది.



నావికదళం చీఫ్ ఇంజనీర్‌ను సత్కరిస్తున్న ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉప కులపతి రాజశేఖర్

స్వీయ ఆవిష్కరణలతోనే దేశాభివృద్ధి

నావికాదళం చీఫ్ ఇంజనీర్ పంకజ్‌త్యాగి

మద్దిలపాలెం,సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వీయ ఆవిష్కరణలతో దేశ అభివృద్ధి సాధిస్తుందని విశాఖ నావికాదళం చీఫ్ ఇంజనీర్ పంకజ్‌త్యాగి పేర్కొన్నారు. ఏయూ సివిల్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో సోమవారం వైవీఎస్ ఆడిటోరియంలో నిర్వహించిన సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థుల వార్షిక సమ్మేళనం-2025 కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సివిల్ ఇంజనీర్లు పర్యావరణ హితమైన నిర్మాణాలకు ప్రాధాన్యత నివ్వాలని సూచించారు. భవిష్యత్తు భారతావనని నిర్మించే బాధ్యతను యువ ఇంజనీర్లు చేపట్టాలన్నారు. ఇంజనీరింగ్ ప్రొఫెషనల్‌గా కాకుండా మిషన్‌గా ఉండాలనన్నారు.రైల్వే నిర్మిస్తున్న అత్యంత ఎత్తైన వ్యవస్థలు భారతదేశ సాంకేతిక అభివృద్ధికి నిదర్శనాలుగా చెప్పారు. దేశంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న రహదారులు, రైల్వే, నీటి పారుదల ప్రాజెక్టులు మన దేశ ఇంజనీరింగ్ ప్రతిభకు తార్కాణాలుగా అభివర్ణించారు. ఏయూ ఉపకులపతి జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పరిజ్ఞానానికి పరిమితం కాకుండా ప్రత్యక్ష అవగాహన కలిగివుండాలన్నారు. సవాళ్లను స్వీకరించే సానుకూల దృక్పథం అవసరమన్నారు. ఐఐటీ కాన్పూర్ ప్రొఫెసర్ మాధవ్ మాట్లాడుతూ సమాజాన్ని అభివృద్ధి చేయగలిగే శక్తి ఇంజనీర్లకు ఉందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కె.రాంబాబు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు కేవీవీ రావు, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి సత్యనారాయణరెడ్డి, ఆచార్య ఎస్.యజ్ఞని, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 18వ వార్డులోని ఎంవీపీకాలనీ తొమ్మిదో సెక్టార్‌లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కార్పొరేటరు గొలగాని మంగవేణి సోమవారం శంకుస్థాపన చేశారు. రూ.1.8 కోట్ల జీవీఎంసి నిధులతో రహదారులు, డ్రైనేజీలు, కల్వర్టులు నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కారి రామారావు, నూకరాజు, సింహాద్రి, గురయ్య, అధికారులు పాల్గొన్నారు.

ఓజోన్ పొర పరిరక్షణ అందరి బాధ్యత

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి):ఓజోన్ పొర పరిరక్షణ మానవాళి బాధ్యతని ఆంధ్ర విశ్వవిద్యాలయం పర్యావరణ విభాగం విశ్రాంత ఆచార్యులు డాక్టర్ ఉదయభాస్కరరెడ్డి అన్నారు. ఎంవీపీ కాలనీలోని సమత డిగ్రీ కళాశాలలో సోమవారం అంతర్జాతీయ ఓజోన్ డే నిర్వహించారు. కాలుష్య నియంత్రణ మండలి, గ్రీన్ క్లైమెట్ స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా విద్యార్థులకు అవగాహన కల్పించాయి. పర్యావరణంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాల్సిన ఆవశ్యకతను కళాశాల డైరెక్టర్ శ్రీనివాస్ వివరించారు. గ్రీన్ క్లైమెట్ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను దూరంగా ఉంచాలన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రామకృష్ణ, యాక్షన్ ఎయిడ్ కర్ణాటక ప్రాజెక్ట్ ఫెసిలిటేటర్ కృష్ణకుమారి, గ్రీన్ క్లైమేట్ సంస్థ కో ఆర్డినేటర్ జనపరెడ్డి రాజేశ్వరి పాల్గొన్నారు.

రోగులతో విమ్స్ కిటకిట

ఆరిలోవ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : విమ్స్‌కి రోగుల తాకిడి పెరిగింది. సోమవారం ఓపీకి అధికసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 1,150 మందికి ఓపీ సేవలు అందించామని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె. రాంబాబు తెలిపారు.

స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ఏర్పాట్ల పరిశీలన



అధికారులతో చర్చిస్తున్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి జగదీశ్వరరావు

విశాఖపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17న సీఎం చంద్రబాబు ప్రారంభించనున్న స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ప్రోగ్రామ్ ఏర్పాట్లను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఇతర అధికారులు సోమవారం పరిశీలించారు. బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్‌హాల్ సాగరికలో కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా విభాగాల వారీగా ఏర్పాటు చేయనున్న స్టాల్స్, ఇతర అంశాలకు సంబంధించి అధికారులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎన్‌టీఆర్ వైద్య సేవ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.అప్పారావు, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ రమేష్, డీపీఎం డాక్టర్ ఉమావతి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, కేజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ రమణ, ఆర్‌బీఎస్‌కే కో-ఆర్డినేటర్ డాక్టర్ హారిక తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని మంత్రికి వినతి



మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్టర్లు

విశాఖపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలో పెండింగ్ బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు జీవీఎంసీ కాంట్రాక్టర్లు అమరావతిలో సోమవారం వినతిపత్రం అందజేశారు. అభివృద్ధి పనులు పూర్తిచేసి ఏడాది గడుస్తున్నా బిల్లులు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని వివరించారు. ప్రస్తుతం రూ.400 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నందున దసరా నాటికి ఎంతోకొంత ఇచ్చి ఆదుకోవాలని కోరారు. మంత్రిని కలిసినవారిలో కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పి.నాగరాజు, సంజీవరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.రమేష్ తదితరులున్నారు.

20, 21న బ్రహ్మపూర్ పాసింజర్ రద్దు

విశాఖపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిలారు, ఉర్లాం, శ్రీకాకుళం, దూసి, పొందూరు మధ్య ఆధునికీకరణ నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈనెల 20, 21న విశాఖ-బ్రహ్మపూర్ పాసింజర్ (58532), (58531) సర్వీసులను రద్దు చేశామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

వసతి గృహాల్లో మెరుగైన సదుపాయాలు కల్పించాలి

- వార్డెన్లకు సూచించిన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుతో ఉద్యోగులు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బీసీ వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాల ని బీసీ సంక్షేమ అధికారి కృష్ణారావు, వార్డెన్లను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆదేశించారు. సోమవారం ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయనతో వసతి గృహాల వార్డెన్లు సమావేశమయ్యారు. ఎమ్మెల్యేను సత్కరించిన అనంతరం సమస్యలపై చర్చించారు. విద్యార్థుల ఇబ్బందులను ఎప్పటికప్పుడు తెలుసుకోవడం, తగిన విధంగా స్పందించాలని ఎమ్మెల్యే వారికి సూచించారు.

భీమిలిలో హిందీ పక్షోత్సవాలు ప్రారంభం

భీమునిపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పండిట్ నెహ్రూ జీవీ ఎంసీ పాఠశాలలో జాతీయ హిందీ పక్షోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఆదర్శ హిందీ ప్రేమి మండలి గౌరవాధ్యక్షుడు గంటా నూకరాజు, వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణారావు నెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పక్షోత్సవాల్లో భాగంగా ఈనెల 21న జాతీయ సమైక్యత అన్న అంశంపై విద్యార్థులకు చిత్రలేఖనం, వకృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు.

దేశీయ సాంకేతిక పరిజ్ఞానం పెంపొందాలి



ఆచార్య రాధాకృష్ణను సత్కరిస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్

విశాఖపట్నం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానం కోసం విదేశాలపై ఆధారపడకుండా దేశీయంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఐఐటీ మద్రాస్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ఆచార్యులు భట్నాగర్ అవార్డు గ్రహీత గంటి రాధాకృష్ణ అన్నారు. ఏయూ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సమావేశ మందిరంలో నిర్వహించిన డాక్టర్ ఆర్ విజయశాంతి స్మారక ఉపన్యాసంలో ఆయన 5జి టెక్నాలజీ అభివృద్ధి అంశంపై ప్రసంగించారు. టెలికాం రంగానికి అవసరమైన ఉత్పత్తులు అధికంగా దిగుమతి చేసుకుంటున్నామని, వీటిని గణనీయంగా తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. దేశీయపరిశ్రమలు అభివృద్ధి చెందడం ద్వారా ఇది సాధ్యమవుతుందన్నారు. దేశానికి సొంతనెట్‌వర్క్ టెలికాం వ్యవస్థ అవసరమన్నారు. మనం వినియోగిస్తున్న మొబైల్ ఫోన్లు దేశీయంగా ఉత్పత్తి చేయాలన్నారు. పదేళ్లకోసారి టెక్నాలజీలో మార్పులు వస్తాయన్నారు. ఆయా దేశాల ప్రజల అవసరాలకు అనుగుణంగా సాంకేతికత అభివృద్ధి చేయడం పై ఐటీయూ పనిచేస్తుందన్నారు. ఏయూ ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ రాధాకృష్ణను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు, విభాగాధిపతి ఆచార్య టి.జ్యోత్స్న, డీన్ ఆచార్య కె.రమాసుధ తదితరులు పాల్గొన్నారు.

ఎండాడ డబుల్ రోడ్డులో స్వచ్ఛభారత్

ఎండాడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్నేషనల్ హౌస్ కీపింగ్ వారోత్సవాల్లో భాగంగా గీతం యూనివర్సిటీలో విధులు నిర్వర్తిస్తున్న హౌస్‌కీపింగ్ సిబ్బంది సోమవారం ఎండాడ డబుల్ రోడ్డులో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వర్గీయ డాక్టర్ ఎంవీవీఎస్ మూర్తి స్మృతి వనం నుంచి రుషికొండ కూడలి వరకు రోడ్డుకి ఇరువైపులా ఉన్న చెత్తను తొలగించారు. గీతం ఆస్పత్రి విభాగం డైరెక్టర్ హేమంత్ బగ్గా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వందకి పైగా సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు నీటి సమస్య పరిష్కరించాలి

పద్మనాభం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనంతవరం పంచాయతీ గొల్లలపాలెంలో మురుగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ స్థానికులు ఎంపీడీఓ విజయకుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో మురుగునీటి పారుదలకు మార్గం లేక వాడుక నీరు, వర్షం నీరు ఏకమై ఇళ్ల మధ్య ఉండిపోవడంతో విష జ్వరాలు, డయేరియా బారిన పడాల్సి వస్తోందన్నారు. ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా మురుగు నీటి పారుదలకు పరిష్కారం చూపడం లేదని చెప్పారు. అధికారులు స్పందించి డ్రైనేజీ ఏర్పాటు చేయడంతో పాటు తాగునీటి సమస్యను కూడా పరిష్కరించాలని కోరారు.



ఇంజనీర్లను సన్మానిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

దేశ ప్రగతికి బాటలు వేసేది ఇంజనీర్లే : మేయర్

వెంకోజీపాలెం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇంజనీర్లు దేశ ప్రగతికి పునాదని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో జాతీయ ఇంజనీర్ల దినోత్సవం సందర్భంగా సోమవారం డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరావుతో కలిసి ఇంజనీర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఇంజనీర్లను గౌరవించాలన్నారు. ఇంజనీర్ల పితామహుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఏటా సెప్టెంబరు 15న జాతీయ ఇంజనీర్ల దినోత్సవం నిర్వహించుకుంటున్నామన్నారు. ఆయన సేవలు ఎనలేనివని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు, వైసీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీర్ సంపత్‌కుమార్, కార్యనిర్వాహక ఇంజనీర్లు దిలీప్, మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి అభినందన



తిరుమల శ్రీదేవిని అభినందిస్తున్న జీవీఎంసీ కమిషనర్ గార్గ్

వెంకోజీపాలెం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్న భీమిలి జీవీఎంసీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు మాదాబత్తుల తిరుమల శ్రీదేవిని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అభినందించారు. ఆయన చాంబర్లో సోమవారం శ్రీదేవి కమిషనర్‌ను కలిశారు. ఈ సందర్భగా కమిషనర్ మాట్లాడుతూ విద్యా బోధనతో పాటు చిన్నారులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో శ్రీదేవి ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. ఆమెకు అవార్డు రావడంతో నగరానికి పేరు ప్రతిష్ఠలు దక్కాయన్నారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ఉన్నతికి నిరంతరం కృషి చేయాలని సూచించారు.

విశాఖ ఉక్కును పరిరక్షించుకుంటాం: ఏఐవైఎఫ్



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏఐవైఎఫ్ నాయకుల నిరసన

సిరిపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రుల త్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకుంటామని ఏఐవైఎఫ్ సభ్యులు ప్రతినబూనారు. సోమవారం వారు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించారు. దాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు వై. రాంబాబు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ అంశంపై జేపీ నడ్డా ఎటువంటి ప్రకటన చేయకపోవడం విచారకరమన్నారు. రాష్ట్ర ప్రజలను బీజేపీ మోసం చేస్తోందన్నారు. ఉక్కు పరిశ్రమను నిర్వీర్యం చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను అడ్డుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి నాగరాజు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వనజాక్షి, మధురెడ్డి, రమణ, హేమానంద్ పాల్గొన్నారు.

రహదారులను ఆక్రమిస్తే చర్యలు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రహదారులు, స్టీల్‌ప్లాంట్ స్థలాలను ఆక్రమిస్తే సహించేది లేదని, త్వరలోనే ఈ స్థలాలకు ఆనుకుని ఉన్న బడ్డీలు తొలగిస్తామని హెచ్‌బీకాలనీ స్టీల్‌ప్లాంట్ స్థలాల భద్రత ఇన్‌చార్జి ఆంజనేయులు, జోన్-3 జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ హెచ్చరించారు. హెచ్‌బీకాలనీ సంతమార్గంలోని స్టీల్‌ప్లాంట్ స్థలాలకు ఆనుకుని ఉన్న రోడ్లపై వ్యాపారాలు సాగిస్తున్న వారిపై స్టీల్‌ప్లాంట్ భద్రతా సిబ్బంది, జీవీఎంసీ జోన్-3 జెడ్సీ శివప్రసాద్, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బడ్డీల కారణంగా అసాంఘిక కార్యకలాపాలు ఎక్కువవుతున్నాయని, స్థానికులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, యజమానులు ఆక్రమిత స్థలాలను స్వచ్ఛందంగా తొలగించాలని చెప్పారు. లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ భద్రతా సిబ్బంది కోటేశ్వరరావు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

రాజీవ్‌నగర్‌లో చోరీ

ఆరిలోవ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు మూడు తులాల బంగారు ఆభరణాలను చోరీ చేశారు. ఈ సంఘటన జీవీఎంసీ పదో వార్డు పాతడైరీ ఫారం సమీపంలోని రాజీవ్‌నగర్‌లో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. విశాఖ వేలీ స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న శారద సోమవారం ఉదయం ఇంటికి తాళం వేసి పాఠశాలకు వెళ్లారు. మధ్యాహ్న భోజనానికి తిరిగి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్ల చూడగా బీరువాలోని మూడు తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. వెంటనే ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ హరికృష్ణ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు తులం చైను, రెండు తులాల నక్లెస్ చోరీకి గురయ్యాయని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఇన్నోవేషన్ పాస్‌పోర్టుతో ఎన్నో ప్రయోజనాలు

- ఏపీ మెడ్‌టెక్ జోన్ సీఈవో జీతేంద్రశర్మ

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇన్నోవేషన్ పాస్‌పోర్టు అంటే కేవలం మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా మార్కెట్ సమయం, ఖర్చులను తగ్గించి భారతీయ స్టార్టప్‌లు ప్రపంచవ్యాప్తంగా పోటీ పడడానికి సహాయపడే ఎండ్ టూ ఎండ్ సపోర్టు సిస్టమ్‌ను సృష్టించడమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మెడ్‌టెక్ జోన్ సీఈవో జీతేంద్రశర్మ అన్నారు. మెడ్‌టెక్ జోన్‌లో సోమవారం ఇన్నోవేషన్ పాస్‌పోర్టు ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే అగ్రగామి ఇంటిగ్రేటెడ్ మెడికల్ డివైస్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ మెడ్‌టెక్ జోన్‌లో జరుగుతుందన్నారు. ఆరోగ్య సంరక్షణ, ఆలోచనలకు ప్రభావంతమైన సొల్యూషన్‌గా మార్చడానికి ఇదొక ప్రత్యేకమైన సింగిల్ యాక్సెస్ గేట్ వే అని పేర్కొన్నారు. ఇన్నోవేషన్ పాస్‌పోర్టులో ఇప్పటికే 75 ఇంక్యుబేటర్లు ఉన్నాయని, ఇవి దేశమంతటా వెయ్యికి పైగా స్టార్టప్‌లను అనుసంధానం చేస్తాయన్నారు. కార్యక్రమంలో పలుఉరు మెడ్‌టెక్ జోన్ అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ సివిల్ డిఫెన్స్ ఇన్‌స్పెక్టర్‌గా కేవై రెడ్డి



కేవై.రెడ్డిని అభినందిస్తున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పౌర రక్షణ రంగంలో విశిష్ట సేవలందిస్తున్నవాల్తేరు డివిజన్ సివిల్ డిఫెన్స్ ఇన్‌స్పెక్టర్ కేవై.రెడ్డికి 2024 వార్షిక సంవత్సరానికి గాను 'ఉత్తమ సివిల్ డిఫెన్స్ ఇన్‌స్పెక్టర్‌గా' కేంద్ర హోం శాఖలోని డైరక్టర్ జనరల్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్, సివిల్ డిఫెన్స్, హోంగార్డు శాఖ నుంచి అవార్డు దక్కింది. ఈ సందర్భంగా వాల్తేరు రైల్వే డీఆర్ఎం లలిత్ బొహ్రా సోమవారం తన కార్యాలయంలో కేవై.రెడ్డిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవై.రెడ్డి అందించిన ఆదర్శప్రాయమైన సేవలకు మంచి గుర్తింపు వచ్చిందని, సివిల్ డిఫెన్స్ వలంటీర్లకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఎమతో పాటు సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ ఏకే.ముతత్కర్ పాల్గొన్నారు.

తెలుగు భాషను రక్షించుకోవాలి

- ప్రాథమిక విద్యాబోధన పూర్తిగా తెలుగులోనే ఉండాలి
- ప్రభుత్వ పెద్దలతో అసెంబ్లీ సమావేశాల్లోనే తేల్చుకుంటాము
- తెలుగు దండు వ్యవస్థాపక అధ్యక్షుడు పరవస్తు సూరి



సమావేశంలో మాట్లాడుతున్న పరవస్తు సూరి

సీతంపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలుగును ఒక పాఠ్యాంశంగా కాకుండా, విద్యాబోధన మొత్తం తెలుగుభాషలో ఉండాలని తెలుగుదండు ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రభుత్వం తెలుగు మాధ్యమం పట్ల సానుకూల నిర్ణయం తీసుకోని పక్షంలో గాంధీయ మార్గంలో సాగే మాతృభాష పరిరక్షణ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శాంతిపురంలో ఉన్న తెలుగు దండు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో తెలుగుదండు వ్యవస్థాపక అధ్యక్షుడు పరవస్తు సూరి మాట్లాడుతూ తెలుగు భాషను అవమానించినా, నిర్లక్ష్యం చేసినా తెలుగు నేల క్షమించదని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏర్పడి ఏడాదిన్నర పూర్తయినప్పటికీ భాష రక్షణ వియంలో ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. గత ప్రభుత్వం తెలుగు భాషను నాశనం చేసిందని మాటలు చేప్పారని, అధికారంలోకి వచ్చిన తరువాత ఇంకా చర్యలరు తీసుకోకపోవడం గమనార్హమన్నారు. ప్రాథమిక విద్యా బోధన మాతృభాషలో ఉండాలని ఎన్నో ఏళ్లగా మేధావులు, భాషాభిమానులు చేస్తున్న ఎన్నో అభ్యర్థనలు చేస్తున్నారని అన్నారు. అసెంబీల్ల సమావేశాల్లో చర్చించి మాతృభాషాభివృద్ధికి ప్రాధికార సంస్థను ఏర్పాటు చేయాలని, ప్రాథమిక విద్యాబోధన కచ్చితంగా తెలుగులోనే జరిగేలా అధికారిక ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. 18 నుంచి జరిగే అసెంబ్లి సమావేశాలకు వెళతామని, తెలుగుభాష రక్షణ గురించి ప్రభుత్వ పెద్దలతో మాట్లాడతామని తెలిపారు. వందలాది కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, భాషాభిమానులు, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారని, అసెంబ్లి సమావేశాలు ముగిసేంత వరకు అక్కడే ఉండడానికి సిద్ధంగా ఉన్నారని, తమ నిరసనలు తెలియజేస్తామని అన్నారు. ఈ సమావేశంలో వేదుల కామేశ్వర శర్మ, సీహెచ్ చిన సూర్యనారాయణ, కేవీఎస్ మూర్తి, వరహారశెట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

శుద్ధి చేసిన మురుగునీటితో సంపద సృష్టి

... 5వ పేజీ తరువాయి

వీడియోలను ప్రదర్శించామన్నారు. మురుగునీటిని శుద్ధి చేయడానికి భారీగా ఖర్చు చేస్తున్నామని, ఆదాయం సమకూర్చుకోవడం కోసం శుద్ధి చేసిన నీటిని పరిశ్రమలకు విక్రయించడం ప్రారంభించగా, వారి నుంచి డిమాండ్ పెరుగుతోందని వివరించామన్నారు. ప్రస్తుతం శుద్ధి చేసిన మురుగునీటిని కిలోలీటర్ రూ.60 చొప్పున ప్రతీరోజూ 67 ఎంఎల్‌డీ విక్రయిస్తున్నామని, భవిష్యత్తులో 210 ఎంఎల్‌డీ నీటిని విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకున్నందున దానికి సంబంధించిన ప్రణాళికలను వివరించానన్నారు. దీనికి అందరి నుంచి మంచి స్పందన లభించడంతోపాటు ఆయా నగరాల్లో కూడా దీనిని అమలుచేసే మార్గాలపై దృష్టిసారిస్తామని తనతో పేర్కొన్నారన్నారు.

మరోవైపు సూరత్ మోడల్‌లో నగరంలో భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణకు సంబంధించి కనస్ట్రక్షన్ అండ్ డిమాలిస్డ్ వేస్ట్ (సీ అండ్ డీ) ప్లాంటును నిర్వహించాలని నిర్ణయించామన్నారు. జీవీఎంసీలో సీ అండ్ డీ ప్లాంటు నిర్వహణకు జీవీఎంసీయే కాంట్రాక్టర్‌కు డబ్బులు చెల్లిస్తుండగా, సూరత్‌లో డెవలపరే అక్కడి కార్పొరేషన్‌కు డబ్బులు కడుతుండడం తనను ఆకట్టుకుందన్నారు. శిథిల భవనాలు, పాత భవనాలను ఎవరైనా కూల్చివేసి దాని స్థానంలో కొత్తనిర్మాణం చేపట్టాలంటే ముందుగా నగర పాలక సంస్థ అనుమతి కోసం దరఖాస్తు చేస్తారన్నారు. ఆ సమయంలోనే డెబ్రిస్‌ను యార్డుకు తరలించడానికి అయ్యే ఖర్చును భవన యజమాని నుంచి వసూలుచేస్తున్నారన్నారు. ఆ డెబ్రిస్‌ను కాంట్రాక్టర్ (డెవలపర్) యార్డుకు తీసుకువెళ్లి అక్కడ టైల్స్, సిమెంట్ ఇటుకలు తయారుచేసి విక్రయించుకుంటున్నారన్నారు. దీనివల్ల అక్కడి కార్పొరేషన్‌పై ఆర్థిక భారం పడకుండా, తిరిగి ఆదాయం చేరుతోందన్నారు. అదే మోడల్‌ను త్వరలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

దుర్గాగణపతి హుండీ ఆదాయం రూ.1,84,727



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

సీతంపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక దుర్గాగణపతి ఆలయంలో హుండీలను సోమవారం లెక్కించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి రామభాయి, కరకచెట్టు అమ్మవారి కార్యనిర్వాహణాధికారి కె.గాయత్రి పర్యవేక్షణలో ఆలయంలో హుండీలను లెక్కించారు. హుండీలో రూ.1,84,727 ఆదాయ వచ్చినట్టు దుర్గాగణపతి ఆలయం ఈఓ తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధుల వినతి



తహశీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

సీతమ్మధార, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం ఆలస్యం చేస్తోందని, ఉద్యోగులకు జరగాల్సిన ఆర్థిక ప్రయోజనాలు కల్పించడంలో ప్రభుత్వం ఉద్యోగుల పక్షం వహించడం లేదని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు లేవని ఫెడరేషన్ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతు సీతమ్మధారలో ఉన్న అర్బన్ తహశీల్దార్ పీవీవీ ప్రసాద్‌కు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ 257 జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రామకృష్ణరావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరావు, సీతమ్మధార మండల అధ్యక్ష, కార్యదర్శులు బలిరెడ్డి శ్రీనివాసరావు, బీకే దుర్గాకుమారి, మహారాణిపేట మండల అధ్యక్షుడు బండారు దేముడు బాబు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

57వ వార్డులో ఎమ్మెల్యే గణబాబు పర్యాటన



అధికారులకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే గణబాబు

మర్రిపాలెం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 57వ వార్డు మర్రిపాలెం శ్యామ్‌నగర్ కాలనీలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వచ్చిన నీటి ప్రవాహానికి మట్టి కొట్టుకుపోవడంతో గెడ్డ గోడను ఆనుకుని ఉన్న ఇల్లు, పక్కనే ఉన్న ట్రాన్‌ఫార్మర్ ఆదివారం రాత్రి కూలిపోయాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గణబాబు సోమవారం ఉదయం శ్యామ్ నగర్ కాలనీలో పర్యటించి కూలిన వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీలైనంత త్వరగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవలిన అధికారులకు సూచించారు. అనంతరం ఇల్లు కూలిపోయిన బాధితులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోన్ -5 కమిషనర్ బి.రాము, ఈపీడీసీఎల్ ఈఈ నాయుడు, 57వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పెంటకోట అజేయ్‌బాబు ముర్రు నానాజీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి అండర్-19 స్కూల్ గేమ్స్

విశాఖపట్నం, స్పోర్ట్స్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అండర్ 19 బాలబాలికల స్కూల్ గేమ్స్ ఈనెల 18 నుంచి నిర్వహించనున్నామని కార్యనిర్వాహక కార్యదర్శి వీఏ పుష్పలత తెలిపారు. ఇంటర్‌మీడియేట్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించనున్న క్రీడా పోటీల్లో పాల్గొనేవారు జనవరి ఒకటి, 2007 లేదా ఆ తర్వాత పుట్టినవారై ఉండి, ఆరు నుంచి 12వ తరగతి వరకు చదువుతుండాలన్నారు. 18న పరవాడ ఎస్‌వీఎస్ జూనియర్ కాలేజీలో రెజ్లింగ్, తైక్వాండో, మోడరన్ పెంటాథ్లాన్, మార్షల్ ఆర్ట్స్ తంగాట, గట్కా పోటీలుంటాయి. 19న ఏయూ గ్రౌండ్‌లో టెన్నిస్, వైఎంసీఏలో స్విమ్మింగ్, వాటర్ పోలో, వుడా పార్కులో స్కేటింగ్, బీచ్ వాలీబాల్, గోపాలపట్నం ఇండోర్ స్పోర్ట్స్ హాల్లో టేబుల్ టెన్నిస్, జిమ్నాస్టిక్స్, బుల్లయ్య కాలేజీలో వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలుంటాయి. ఈనెల 20న అనకాపల్లి ఏఎంఏఎల్ జూనియర్ కాలేజీలో అథ్లెటిక్స్, రగ్బీ పోటీలుంటాయన్నారు. వివరాలకు 9440885898, 9985065340, 9951676965 నంబర్లలో సంప్రతించాలన్నారు.

చిన్నారి కాదు చిరుత కూన

- ఏడు కిలో మీటర్ల ట్రెక్కింగ్‌ను పూర్తి చేసిన ఆద్య



తండ్రి భరత్‌తో ఆద్య

విశాఖపట్నం, స్పోర్ట్స్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కంబాల కొండ ట్రెక్కింగ్‌ను ఏడేళ్ల చిన్నారి ఆద్య పూర్తి చేసి అందరినీ ఆశ్చర్యా పరిచింది. ఏడు కిలో మీటర్ల కఠినమైన ట్రెక్కింగ్‌ను తన తండ్రి భరత్‌తో కలిసి పూర్తి చేసి 'అతి చిన్న వయసులో ట్రెక్కింగ్‌ను విజయవంతంగా పూర్తి చేసిన ఘనత సాధించింది. ఆద్య తాతయ్య ఎం. నారాయణరావు మాజీ అథ్లెట్ కాగా ప్రస్తుతం ఏపీ అథ్లెటిక్స్ జట్టు సెలక్షన్ కమిటీ చైర్మన్, జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శిగా సేవలందిస్తున్నారు. ఈ నేపథ్యంలో చిన్నతనం నుంచే ఆద్యకు శారీరక పటుత్వంపై అవగాహన కల్పించడంతోపాటు సాధనకు ప్రోత్సహిస్తూ భవిష్యత్తులో అంతర్జాతీయ ట్రెక్కర్‌గా తీర్చిదిద్దుతానన్నారు.

నగరానికి నెదర్లాండ్స్ రాయబారి



విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న మారిస గెరార్ట్స్

గోపాలపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మూడు దేశాల పర్యటనలో భాగంగా నెదర్లాండ్స్‌త రాయబారి మారిస గెరార్ట్స్ సోమవారం రాత్రి విశాఖ చేరుకున్నారు. రాత్రి 11.15 గంటలకు ఢిల్లీ నుంచి ఆమె ఇక్కడి విమానాశ్రయానికి చేరుకున్నారు. విశాఖతో పాటు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఈ నెల 18వ తేదీ వరకు ఆమె పర్యటించనున్నారు. అనంతరం నేపాల్, బూటాన్ దేశాల పర్యటనకు వెళతారు.

ఆర్టీసీ అధికారుల ఉక్కిరిబిక్కిరి

... 5వ పేజీ తరువాయి

సంఖ్య పెరిగింది. దీంతో ట్రాఫిక్ నియంత్రణ ఆర్టీసీ అధికారులకు కత్తిమీద సాములా తయారయ్యింది. ఈ నేపథ్యంలో ప్రయాణ సమయం మార్చుకోవాలని ఆర్టీసీ అధికారులు కోరుతున్నారు. మరోవైపు విశాఖ రీజియన్‌కు కనీసం 170 బస్సులు సత్వరమే పంపాలని ప్రధాన కార్యాలయానికి రీజనల్ మేనేజర్ లేఖ రాశారు.

ప్రతిరోజూ ఉదయం 7.00 నుంచి 10.00 గంటలు, సాయంత్రం 4.00 నుంచి రాత్రి 7.00 మధ్య 1.6 లక్షల మంది విద్యార్థులు (పాస్‌లు తీసుకున్న సంఖ్య) ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. ఇదే సమయంలో ఉద్యోగాలకు, వ్యాపారాలకు, ఇతర వ్యవహారాలకు సంబంధించి పురుషులు, మహిళలు మరో లక్షన్నర మంది ప్రయాణిస్తున్నారు. స్త్రీశక్తి పథకం అమలు తరువాత పెరిగిన లక్ష మంది ప్రయాణికుల్లో ఎక్కువ మంది అవే సమయాల్లో ప్రయాణాలు చేస్తున్నారు. ప్రయాణికుల సంఖ్యకు తగ్గట్టుగా బస్సులు సమకూర్చడం అధికారులకు అసాధ్యమవుతున్నది. ద్వారకా బస్‌స్టేషన్, మద్దిలపాలెం, సింహాచలం, ఎంవీపీ కాలనీ బస్ స్టేషన్‌ల్లో ప్రయాణికులు బస్సుల కోసం గంటల సమయం వేచి ఉండాల్సిన పరిస్థితి వచ్చింది.

అధికారులపై పెరుగుతున్న ఒత్తిడి

కాంప్లెక్స్‌లో గంట నుంచి ఉంటున్నా బస్సులు రాలేదని, ఎప్పుడో వచ్చిన బస్సు ఎక్కేందుకు ఒకరినొకరు నెట్టుకోవలసి వస్తోందని ఆర్టీసీ అధికారులను మహిళలు ఫిర్యాదులు చేస్తున్నారు. వేరే రూట్‌ల నుంచి బస్సులు రప్పించాలని యత్నించినా అక్కడా ఇదే పరిస్థితి. బస్సుల కోసం ఆర్టీసీ అధికారులపై ఒత్తిడి పెరుగుతున్నది.

ఉపాధ్యాయ ఎంపిక జాబితా విడుదల

... 5వ పేజీ తరువాయి

అందించనున్నారు. ఈ సందర్భంగా టాపర్లు కొందరికి మాట్లాడే అవకాశం ఇవ్వనుండడంతో జిల్లా నుంచి ఇద్దరు, ముగ్గురి పేర్లతో జాబితాను అధికారులు పంపించారు. నియామక పత్రాలు అందుకునేందుకు అభ్యర్థులు ఈ నెల 18న ఉదయం 7.30 గంటలకు ఉక్కు నగరంలోని విశాఖ విమల విద్యాలయం స్కూల్ నుంచి బస్సులో వెలగపూడికి బయలుదేరుతారు. మెగా డీఎస్సీకి సంబంధించి డీఈవో కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటుచేశారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ 94404 84917, 91772 92969, 96185 84051 నంబర్లకు ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చునని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రేమ్‌కుమార్ తెలిపారు.

వేతనాల కోసం ఉక్కు ఉద్యోగుల ఆందోళన

... 5వ పేజీ తరువాయి

షోకాజు నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. జీతాల విషయంలో స్థానిక ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వైటీ దాసు, యు.రామస్వామి, పి.శ్రీనివాసరాజు, కె.గంగాధర్, రాజు, పుల్లారావు, అప్పారావు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటక్ ఆధ్వర్యంలో....

జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఇంటక్ ఆధ్వర్యంలో బీసీ గేటు వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ జీతాల కోసం ప్రతి నెలా ఎదురు చూపులు తప్పడం లేదన్నారు. సంస్థ కోసం నిరంతరం శ్రమిస్తున్న కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పీవీ రమణమూర్తి, బీఎస్ రాజు, నీరుకొండ రామచంద్రరావు, కొమ్ము ప్రసాద్, వెంకన్న, ఈశ్వరరావు, పోతారెడ్డి, అవతారం పాల్గొన్నారు.

మెట్రో టెండర్లలో మార్పు

... 5వ పేజీ తరువాయి

దశ ప్రాజెక్టు రూ.11,498 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఇందులో డబుల్ డెక్కర్ చేరడంతో అదనంగా మరో రూ.2,000 కోట్లు అవసరమని భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు మొత్తం 99.75 ఎకరాలు అవసరమని నిర్ధారించారు. అందులో సుమారు పది ఎకరాలు ప్రైవేటు భూమి ఉంది. ఆ భూ సేకరణకు మరో రూ.882 కోట్లు అవసరమని గతంలోనే లెక్కలు వేశారు. అంటే మొత్తంగా చూసుకుంటే తొలిదశ నిర్మాణానికి రూ.14,380 కోట్లు అవసరం. ఇందులో ప్రస్తుత ప్రణాళిక ప్రకారం 60 శాతం నిధులు పీపీపీ విధానంలో సేకరించి, మిగిలిన 40 శాతం నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా పెట్టుకోవాలనే ప్రాతిపదికన ఫైల్ నడుపుతున్నారు. ఈ నెల 19న జరిగే సమావేశంలో మొదటి దశ పనులు ఎన్ని భాగాలుగా చేసి కాంట్రాక్టర్లకు అప్పగిస్తారనే అంశంపై స్పష్టత వస్తుంది. అప్పుడే ఇది ముందుకు కదులుతుంది.

మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు ఘన నివాళి



విశ్వేశ్వరయ్య విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు

కంచరపాలెం,సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజినీర్స్ డే వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ఉన్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కో యూనివర్సిటీ డైరెక్టర్ అల్తాఫ్ హుస్సేన్ హాజరైయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ రంగంలో విశ్వేశ్వరయ్య అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏపీ ఈపీడీసీఎల్‌లో...

సీతమ్మధార, (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) కార్పొరేట్ కార్యాలయంలో భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజనీర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో విశ్వేశ్వరయ్య చిత్రపటానికి సిబ్బంది పూలమాలలను వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీజీఎంలు మాట్లాడుతూ దేశాభివృద్ధికి విశ్వేశ్వరయ్య అందించిన సేవలు మరువలేనివని, ఆయన జీవితం ప్రతి ఇంజనీర్‌కు ఆదర్శమని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి మెరుగైన సేవలు అందించేందుకు ఇంజనీర్లు మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్లు వి.విజయలలిత, డి.సుమన్ కల్యాణి, బి.శ్రీదేవి, కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అన్ని వర్గాలకు లబ్ధి

- టీడీపీ వార్డు అధ్యక్షుడు బండి రంజిత్



సంబరాలు చేసుకుంటున్న ఆటో డ్రైవర్లు

కంచరపాలెం,సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దసరా కానుకగా ఆటోడ్రైవర్లకు రూ.15వేలు నగదు సహాయం అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడంతో 55వ వార్డులోని ఆటోడ్రైవర్లు సోమవారం సంబరాలు జరుపుకున్నారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు బండి రంజిత్ ఆధ్వర్యంలో స్థానిక గంగన్న నగర్, తిక్కవానిపాలెం గ్రామాలకు చెందిన ఆటో డ్రైవర్లు చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రంజిత్ మాట్లాడుతూ చంద్రబాబుతోనే అన్ని వర్గాలకు లబ్ధిచేకూరుతుందని అన్నారు. ఎంపీ భరత్ ఆదేశాల మేరకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి నేతృత్వంలో ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రతి ఇంటికి తీసుకువెళతున్నామని అన్నారు. అనంతరం ఆటో డ్రైవర్లుకు వార్డు కమిటీ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్యదర్శి ఎస్.రమణ అప్పారావు, జనసేన అధ్యక్షుడు నూకరాజు, తదితర నాయకులు పాల్గొన్నారు.

సర్వీస్ రంగంలో విశాఖకు ఏ+

... 5వ పేజీ తరువాయి

స్వర్ణాంధ్రలో 63 పాయింట్లతో బి గ్రేడ్ సాధించింది. వ్యవసాయ రంగంలో 26 ప్లాయింట్లతో 'సి' గ్రేడ్‌కు పరిమితమైంది. ఏడాదికి రూ.6,791 కోట్లు లక్ష్యం ఇవ్వగా, తొలి క్వార్టర్‌లో కేవలం రూ.749 కోట్లు సాధించింది. పరిశ్రమల రంగంలో 63 పాయింట్లతో 'బి' గ్రేడ్ దక్కించుకుంది. జిల్లాకు రూ.59,535 కోట్లు లక్ష్యం ఇవ్వగా తొలి క్వార్టర్‌లో రూ.8,030 కోట్లతో 13.49 శాతం సాధించింది. కాగా, విశాఖపట్నంలో పర్యాటక అభివృద్ధికి ఒకేచోట 50 ఎకరాలు సేకరించామని పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి అజయ్ జైన్ ఈ సందర్భంగా ప్రకటించారు.

చోరీ కేసులను ఛేదించిన పరవాడ పోలీసులు

- ఇద్దరు నిందితుల అరెస్టు
- ఐదున్నర తులాల బంగారం, 20 తులాల వెండి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మల్లికార్జునరావు

లంకెలపాలెం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు లంకెలపాలెంలోని శ్రీరామ నగర్ కాలనీ, రామాలయం ప్రాంతాల్లో గత రెండు నెలల వ్యవధిలో జరిగిన రెండు దొంగతనాల కేసులను పరవాడ పోలీసులు ఛేదించారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి ఐదున్నర తులాల బంగారం, 20 తులాల వెండిని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి సీఐ ఆర్.మల్లికార్జునరావు సోమవారం రాత్రి తెలిపిన వివరాలివి. లంకెలపాలెం దరి శ్రీరామనగర్ కాలనీలో నివాసముంటున్న సూరిశెట్టి వెంకట లక్ష్మి ఇంట్లో ఈ ఏడాది జూన్ 21న, రామాలయం వీధిలో నివాసముంటున్న డొంకాడ విమలాకుమారి ఇంట్లో జూలై 12న చోరీలు జరిగాయి. ఈ రెండు కేసుల్లో పదిన్నర తులాల బంగారం, 20 తులాల వెండిని దొంగలు దోచుకుపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివిధ కోణాల్లో విచారణ జరపగా తెలంగాణ రాష్ట్రంలోని సంగారెడ్డి దరి పటాన్ చెరువు ప్రాంతానికి చెందిన కోనాం రవితేజ, లంకెలపాలెం సమీపంలోని గంజిపేటకు చెందిన జామిశెట్టి కృష్ణ చైతన్యలు చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. వీరిద్దరినీ సోమవారం మధ్యాహ్నం లంకెలపాలెం ఐఓసీ పెట్రోల్ బంకు వద్ద అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసులను ఛేదించిన సిబ్బందిని ఎస్పీ తుహిన్‌సిన్హా, క్రైమ్ విభాగం అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు అభినందించారు.

నగరంలో సంయుక్తా మీనన్ సందడి



సంయుక్తా మీనన్

రామ్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సినీ హీరోయిన్ సంయుక్తా మీనన్ సోమవారం నగరంలో సందడి చేసారు, సార్, విరూపాక్ష వంటి చిత్రాలలో నటించిన సంయుక్తా మీనన్ సోమవారం నగరంలో ఒక ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చారు. ఈ సందర్భంగా రామ్‌నగర్‌లోని ఓ హోటల్‌లో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తనకు విశాఖ నగరం, ఇక్కడ బీచ్ అంటే చాలా ఇష్టమన్నారు. అనంతరం తాను నటిస్తున్న చిత్రాల వివరాలను వివరించారు. యువత ఫిట్‌నెస్ సాధించేందుకు శారీరక శ్రమ అవసరమని, అప్పుడే ఆరోగ్యంగా ఉంటారన్నారు.

19న జాబ్‌మేళా

కంచరపాలెం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బాలికల ఐటీఐ ప్రాంగణంలో ఉన్న నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో శుక్రవారం జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు ప్రాంతీయ ఉపాధి కల్పనాధికారి శ్యాం సుందర్ పేర్కొన్నారు. ఈ జాబ్‌మేళాలో ముత్తూట్ ఫైనాన్స్, జాబ్ డీలర్స్, ఎంఎన్‌సీ మ్యానుఫాక్చరింగ్ సంస్థ ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. రిలేషన్‌షిప్ ఆఫీసర్, బీపీవో టెలీ కాలింగ్ సేల్స్, అసెంబ్లీ ఆపరేటర్ తదితర ఉద్యోగాలను భర్తీ చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ జాబ్‌మేళాకు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ అర్హత ఉన్న అభ్యర్థులు హాజరుకావచ్చని చెప్పారు. ఎంపికైనవారు విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందని, అభ్యర్థులు తమ వివరాలను ముందుగా నేషనల్ కెరీర్ సర్వీస్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. జాబ్‌మేళాకు వచ్చే అభ్యర్థులు 19 తేదీన ఉదయం 10 గంటలకు తమ ధ్రువపత్రాలతో హాజరుకావలని తెలిపారు.

పదోన్నతులకు డీఈవో పూల్ పండితుల ఎదురుచూపులు

విశాఖపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖాధికారి పూల్‌లో ఉన్న గ్రేడ్-2 భాషా పండితులు ఏళ్లుగా పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్నారు. ఆది నుంచీ గ్రేడ్-2 భాషా పండితుల పదోన్నతులపై విద్యాశాఖ ఉన్నతాధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారనే విమర్శలున్నాయి. చివరకు కోర్టును ఆశ్రయించడంతో డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును కూడా అమలు చేయకపోవడంపై ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో 2019లో గ్రేడ్-2 భాషా పండితులను స్కూల్ అసిస్టెంట్ తత్సమాన కేడర్‌కలిగిన గ్రేడ్-1 భాషా పండితులుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. దీనికి అనుగుణంగా పాఠశాల విద్యాశాఖ అప్పట్లో మెమో జారీచేసినా 2019లో ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో అమలు పెండింగ్‌లో పెట్టారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ గ్రేడ్-2 భాషాపండితుల పదోన్నతుల జీవో రద్దుచేసింది. ఈ నేపథ్యంలో వారితో పాటు అర్హతలున్న ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించేలా జీవో ఇచ్చారు. దీంతో గ్రేడ్-2 పండితులు, ఎస్జీటీలకు పదోన్నతులు లభించడంతో మరికొందరు పండితులు చివరకు డీఈవో పూల్‌లోకి వెళ్లాల్సి వచ్చింది. గత ఆరేళ్లుగా వీరంతా బదిలీలు జరిగిన ప్రతిసారీ ఒకచోట నుంచి మరో చోటకు వెళ్తున్నారు. పదోన్నతులపై గ్రేడ్-2 పండితులు, ఎస్జీటీల మధ్య వివాదంలో పండితులకు అనుకూలంగా తీర్పు వచ్చింది. కోర్టు తీర్పును తక్షణం అమలుచేయాలని వారంతా కోరుతున్నారు.

భూ ఆక్రమణలకు సహకరిస్తున్న అధికారులు

మహారాణిపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 51 వ వార్డు మాధవధారలో సర్వేనంబరు 9లో ఉన్న ప్రభుత్వ భూమిని జిరాయితీ భూమిగా చూపిస్తు ప్రభుత్వ అధికారులు చేసిన అక్రమ రిజిస్ట్రేషన్లను, పన్నులను వెంటనే రద్దు చేయాలని మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం కన్వీనర్ శ్రీలక్ష్మి డిమాండ్ చేశారు. మురికవాడ భూములను ఆక్రమించుకునేందుకు కబ్జాదారులకు సహకరిస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. పేదలకు నివాసాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో బ్యాంక్ మేనేజర్ ఆత్మహత్యాయత్నం

మహారాణిపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందుతలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సమాచారం అందంతో సమాయానికి వెళ్లి కాపాడిన టూటౌన్ పోలీసులు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఎంవీపీ కాలనీలో నివాసం ఉంటున్న భైరవపట్ల శ్రీరామ్(41) హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, పని ఒత్తిడిని తట్టుకోలేక సూర్యబాగ్‌లోని సోమవారం ఉదయం ఒక హోటల్‌లో రూమ్ తీసుకుని, గదికి గడియ పెట్టుకుని పురుగు మంది తాగాడు. గది నుంచి పురుగుల మందు వాసన రావడం గుర్తించిన హోటల్ సిబ్బంది వెంటనే టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని తలుపులు బద్దలుకొట్టి ఆపస్మారక స్థితిలో ఉన్న శ్రీరామ్‌ను కేజీహెచ్‌కు తరలించారు. తాను అత్మహత్య చేసుకోవడానికి ఆర్థిక ఇబ్బందులే కారణమని లేఖలో పేర్కొన్నాడు. సమయానికి ఆస్పత్రికి తరలించడంతో శ్రీరామ్ ఆరోగ్యం నిలకడగా ఉన్నదని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై విచారణ జరుపుతున్నట్టు సీఐ తెలిపారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తా : కార్పొరేటర్



పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య

వెంకోజీపాలెం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 15వ వార్డులో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య తెలిపారు. ఈమేరకు యూసీడీ ఏఈ రహీమ్‌తో కలిసి సోమవారం పలు ప్రాంతాల్లో పరిశీలించారు. పాత వెంకోజీపాలెం రామాలయం వద్ద పాడైన బోరుబావి స్థానంలో కొత్తది వేయాలని అధికారులకు సూచించారు కొత్త వెంకోజీపాలెం కొండవాలులోని పైపులైను మరమ్మతులను పరిశీలించారు. అనంతరం పాత వెంకోజీపాలెం ఉమానగర్, దుర్గానగర్ కొండవాలులోనూ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులను కొత్తవి అమర్చాలన్నారు. టీడీపీ నేతలు మళ్ల రవికుమార్, అప్పారి గిరిబాబు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

'వందేభారత్' రోజుల సవరణ

విశాఖపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖ నుంచి సికింద్రాబాద్ మధ్య నడుస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సర్వీసు (20707/20708) రోజులను సవరించామని సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ప్రస్తుతం వారంలో గురువారం మినహా మిగిలిన అన్ని రోజుల్లో అందుబాటులో ఉన్న 20707, 20708 నంబర్లు గల వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సర్వీసులు డిసెంబరు 2 నుంచి వారంలో సోమవారం మినహా మిగిలిన అన్ని రోజుల్లో అందుబాటులో ఉండేలా సవరించామని పేర్కొన్నారు. దీంతో ఈ సర్వీసులు డిసెంబరు 2 నుంచి ప్రతి సోమవారం అందుబాటులో ఉండవని స్పష్టం చేశారు. సవరించిన మార్పుల ద్వారా గురువారం అందుబాటులో ఉండేలా డిసెంబరు 2 నుంచి అమల్లోకి వస్తాయని తెలిపారు. ఈ మార్పులను ప్రయాణికులు గమనించాలని సూచించారు.

దేశం గర్వించదగ్గ ఇంజనీర్ విశ్వేశ్వరయ్య: ఏయూ వీసీ

విశాఖపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : దేశం గర్వించదగ్గ గొప్ప ఇంజనీర్‌గా మోక్షగుండం విశ్వేశ్వరయ్య నిలుస్తారని ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ అన్నారు. మోక్షగుండం జయంతి సందర్భంగా సోమవారం ఏయూలోని ఆయన విగ్రహానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. విశ్వేశ్వరయ్య సేవలను గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె .రాంబాబు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లానింగ్ అండ్‌మేనేజ్ మెంట్ డీన్ ఆచార్య కె.శ్రీనివాసరావు, ఇంజనీర్ వి. తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **మిరాయి** : జగదాంబ, మెలోడి, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కిష్కిందపురి** : లీలామహల్, సంగం, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక),
- **అర్జున్ చక్రవర్తి** : రమాదేవి,
- **మదరాసి** : శ్రీకన్య
- **ఘాటీ** : కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : , శ్రీకన్య-2 (గాజువాక)
- **కూలీ** :వెంకటేశ్వర-1, అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 15, టమాటా 24, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 28, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 46, దొండకాయలు 38, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది) 70, బరబాటి 30, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 64, కీరదోస 32, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 32, చిలగడదుంపలు 35, కంద 40, దేముడుచిక్కుడు 76, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు బ్యాగ్

రైతు ధర	130
లైవ్ ధర	150
విత్ స్కిన్	270
స్కిన్‌లెస్	280



తాత్కాలిక పనులు చేపడుతున్న దృశ్యం





కెరటాల ఉధృతికి ఆర్‌కే బీచ్‌లో రహదారి కొట్టుకుపోయిన వైనం, తీరంలో కోతకు గురైన ప్రాంతం

కోతకు గురవుతున్న తీరం

- కెరటాల ఉధృతికి నిర్మాణాలు ధ్వంసం
- పరిరక్షణకు వీఎంఆర్‌డీఏ చర్యలు
- రక్షణ గోడ నిర్మాణానికి ప్రతిపాదనలు

బీచ్ రోడ్డు, సెప్టెంబరు 15, (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతం తరచూ కోతకు గురవుతోంది. కెరటాల ఉధృతికి నిర్మాణాల కింద మట్టి కోసుకుపోతుండగా, పలు మార్లు రహదారులు ధ్వంసమవుతున్నాయి. బంగాళాఖాతంలో ఎప్పుడు అలజడి ఏర్పడినా సముద్ర తీరం కోతకు గురవుతోంది. భీమిలి నుంచి కోస్టల్ బ్యాటరీ వరకు తీర ప్రాంతాలు దెబ్బతింటున్నాయి. అలల తీవ్రతకు ఆర్కే బీచ్‌లో కొన్ని ప్రాంతాలు నేలమట్టమయిపోతున్నాయి. అకస్మాత్తుగా సముద్రంలో కలిసిపోతున్నాయి ఇదొక తీవ్ర సమస్యగా మారింది. అదేవిధంగా మత్స్యకార గ్రామాల్లో నివసించే ప్రజలకు ముప్పు వాటిల్లుతోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని అధికారులు యుద్ధప్రాతిపదికన నివారణ చర్యలు ప్రారంభించారు.

బిక్కుబిక్కుమంటూ జీవనం

జాలారిపేట ఫిషింగ్ హార్బర్ వద్ద నివసిస్తున్న మత్స్యకారులు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. అల్పపీడనాలు, తుఫాన్‌ల సమయంలో అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతుండడంతో వారిలో ఆందోళన నెలకొంటోంది. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని జీవిస్తున్నారు.

కొట్టుకుపోతున్న మట్టి

బీచ్‌రోడ్డులో కోస్టల్ బ్యాటరీ నుంచి వైఎంసీఏ కూడలి వరకు లోతట్టుగా ఉండడం వలన సమస్య ఎదురవుతోంది. ఇక్కడ రోడ్డు ఎత్తుగా ఉండడంతో పాటు రక్షణ గోడ ఉండడంతో తుపాన్లు వచ్చినా సమస్య ఉండేది కాదు. కానీ అలలు చొచ్చుకు వస్తుండడంతో ఎత్తైన గట్టు గోడ వద్ద ఉన్న ప్రాంతం కూరుకుపోతోంది. రక్షణ గోడ కింద భాగంలో మట్టి కొట్టుకుపోవడంతో గోడ కూలిపోయే పరిస్థితి ఎదురవుతోంది. ఈ నేపథ్యంలో కోత నివారణకు అడ్డుకట్ట వేసేందుకు వీఎంఆర్‌డీఏ రంగంలోకి దిగినట్టు సమాచారం. ఇందులో భాగంగా భారీ రక్షణ గోడ నిర్మాణానికి జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థతో కలిసి ప్రాజెక్టు తలపెట్టింది. దీనికి అనుమతి లభిస్తే సుమారు రూ.203 కోట్ల వ్యయంతో పూర్తిస్థాయి రక్షణ చర్యలు చేపట్టనుంది.



నావికదళం చీఫ్ ఇంజనీర్‌ను సత్కరిస్తున్న ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉప కులపతి రాజశేఖర్

స్వీయ ఆవిష్కరణలతోనే దేశాభివృద్ధి

నావికాదళం చీఫ్ ఇంజనీర్ పంకజ్‌త్యాగి

మద్దిలపాలెం,సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వీయ ఆవిష్కరణలతో దేశ అభివృద్ధి సాధిస్తుందని విశాఖ నావికాదళం చీఫ్ ఇంజనీర్ పంకజ్‌త్యాగి పేర్కొన్నారు. ఏయూ సివిల్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో సోమవారం వైఎస్ ఆడిటోరియంలో నిర్వహించిన సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థుల వార్షిక సమ్మేళనం-2క25 కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సివిల్ ఇంజనీర్లు పర్యావరణ హితమైన నిర్మాణాలకు ప్రాధాన్యత నివ్వాలని సూచించారు. భవిష్యత్తు భారతావనని నిర్మించే బాధ్యతను యువ ఇంజనీర్లు చేపట్టాలన్నారు. ఇంజనీరింగ్ ప్రొఫెషనల్‌గా కాకుండా మిషన్‌గా ఉండాలన్నారు.రైల్వే నిర్మిస్తున్న అత్యంత ఎత్తైన వ్యవస్థలు భారతదేశ సాంకేతిక అభివృద్ధికి నిదర్శనాలుగా చెప్పారు. దేశంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న రహదారులు, రైల్వే, నీటి పారుదల ప్రాజెక్టులు మన దేశ ఇంజనీరింగ్ ప్రతిభకు తార్కాణాలుగా అభివర్ణించారు. ఏయూ ఉపకులపతి జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పరిజ్ఞానానికి పరిమితం కాకుండా ప్రత్యక్ష అవగాహన కలిగి వుండాలన్నారు. సవాళ్లను స్వీకరించే సానుకూల దృక్పథం అవసరమన్నారు. ఐఐటీ కాన్పూర్ ప్రొఫెసర్ మాధవ్ మాట్లాడుతూ సమాజాన్ని అభివృద్ధి చేయగలిగే శక్తి ఇంజనీర్లకు ఉందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కె.రాంబాబు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు కేవీవీ రావు, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి సత్యనారాయణరెడ్డి, ఆచార్య ఎస్.యజ్ఞని, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 18వ వార్డులోని ఎంవీపీకాలనీ తొమ్మిదో సెక్టార్‌లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కార్పొరేటరు గొలగాని మంగవేణి సోమవారం శంకుస్థాపన చేశారు. రూ.1.8 కోట్ల జీవీఎంసి నిధులతో రహదారులు, డ్రైనేజీలు, కల్వర్టులు నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కారి రామారావు, నూకరాజు, సింహాద్రి, గురయ్య, అధికారులు పాల్గొన్నారు.

ఓజోన్ పొర పరిరక్షణ అందరి బాధ్యత

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి):ఓజోన్ పొర పరిరక్షణ మానవాళి బాధ్యతని ఆంధ్ర విశ్వవిద్యాలయం పర్యావరణ విభాగం విశ్రాంత ఆచార్యులు డాక్టర్ ఉదయభాస్కరరెడ్డి అన్నారు. ఎంవీపీ కాలనీలోని సమత డిగ్రీ కళాశాలలో సోమవారం అంతర్జాతీయ ఓజోన్ డే నిర్వహించారు. కాలుష్య నియంత్రణ మండలి, గ్రీన్ క్లైమెట్ స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా విద్యార్థులకు అవగాహన కల్పించాయి. పర్యావరణంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాల్సిన ఆవశ్యకతను కళాశాల డైరెక్టర్ శ్రీనివాస్ వివరించారు. గ్రీన్ క్లైమెట్ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను దూరంగా ఉంచాలన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రామకృష్ణ, యాక్షన్ ఎయిడ్ కర్ణాటక ప్రాజెక్ట్ ఫెసిలిటేటర్ కృష్ణకుమారి, గ్రీన్ క్లైమెట్ సంస్థ కో ఆర్డినేటర్ జనపరెడ్డి రాజేశ్వరి పాల్గొన్నారు.

రోగులతో విమ్స్ కిటకిట

ఆరిలోవ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : విమ్స్‌కి రోగుల తాకిడి పెరిగింది. సోమవారం ఓపీకి అధికసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 1,150 మందికి ఓపీ సేవలు అందించామని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె. రాంబాబు తెలిపారు.

స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ఏర్పాట్ల పరిశీలన



అధికారులతో చర్చిస్తున్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి జగదీశ్వరరావు

విశాఖపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17న సీఎం చంద్రబాబు ప్రారంభించనున్న స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ప్రోగ్రామ్ ఏర్పాట్లను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఇతర అధికారులు సోమవారం పరిశీలించారు. బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్‌హాల్ సాగరికలో కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా విభాగాల వారీగా ఏర్పాటు చేయనున్న స్టాల్స్, ఇతర అంశాలకు సంబంధించి అధికారులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎన్‌టీఆర్ వైద్య సేవ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.అప్పారావు, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ రమేష్, డీపీఎం డాక్టర్ ఉమావతి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, కేజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ రమణ, ఆర్‌బీఎస్‌కే కో-ఆర్డినేటర్ డాక్టర్ హారిక తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని మంత్రికి వినతి



మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్టర్లు

విశాఖపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలో పెండింగ్ బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు జీవీఎంసీ కాంట్రాక్టర్లు అమరావతిలో సోమవారం వినతిపత్రం అందజేశారు. అభివృద్ధి పనులు పూర్తిచేసి ఏడాది గడుస్తున్నా బిల్లులు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని వివరించారు. ప్రస్తుతం రూ.400 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నందున దసరా నాటికి ఎంతోకొంత ఇచ్చి ఆదుకోవాలని కోరారు. మంత్రిని కలిసినవారిలో కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పి.నాగరాజు, సంజీవరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.రమేష్ తదితరులున్నారు.

20, 21న బ్రహ్మపూర్ పాసింజర్ రద్దు

విశాఖపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిలారు, ఉర్లాం, శ్రీకాకుళం, దూసి, పొందూరు మధ్య ఆధునికీకరణ నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈనెల 20, 21న విశాఖ-బ్రహ్మపూర్ పాసింజర్ (58532), (58531) సర్వీసులను రద్దు చేశామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

వసతి గృహాల్లో మెరుగైన సదుపాయాలు కల్పించాలి

వార్డెన్లకు సూచించిన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు




ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుతో ఉద్యోగులు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బీసీ వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాల ని బీసీ సంక్షేమ అధికారి కృష్ణారావు, వార్డెన్లను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆదేశించారు. సోమవారం ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయనతో వసతి గృహాల వార్డెన్లు సమావేశమయ్యారు. ఎమ్మెల్యేను సత్కరించిన అనంతరం సమస్యలపై చర్చించారు. విద్యార్థుల ఇబ్బందులను ఎప్పటికప్పుడు తెలుసుకోవడం, తగిన విధంగా స్పందించాలని ఎమ్మెల్యే వారికి సూచించారు.

భీమిలిలో హిందీ పక్షోత్సవాలు ప్రారంభం

భీమునిపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పండిట్ నెహ్రూ జీవీ ఎంసీ పాఠశాలలో జాతీయ హిందీ పక్షోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఆదర్శ హిందీ ప్రేమి మండలి గౌరవాధ్యక్షుడు గంటా నూకరాజు, వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణారావు నెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పక్షోత్సవాల్లో భాగంగా ఈనెల 21న జాతీయ సమైక్యత అన్న అంశంపై విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు.

దేశీయ సాంకేతిక పరిజ్ఞానం పెంపొందాలి



ఆచార్య రాధాకృష్ణను సత్కరిస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్

విశాఖపట్నం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానం కోసం విదేశాలపై ఆధారపడకుండా దేశీయంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఐఐటీ మద్రాస్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం ఆచార్యులు భట్నాగర్ అవార్డు గ్రహీత గంటి రాధాకృష్ణ అన్నారు. ఏయూ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సమావేశ మందిరంలో నిర్వహించిన డాక్టర్ ఆర్ విజయశాంతి స్మారక ఉపన్యాసంలో ఆయన 5జి టెక్నాలజీ అభివృద్ధి అంశంపై ప్రసంగించారు. టెలికాం రంగానికి అవసరమైన ఉత్పత్తులు అధికంగా దిగుమతి చేసుకుంటున్నామని, వీటిని గణనీయంగా తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. దేశీయపరిశ్రమలు అభివృద్ధి చెందడం ద్వారా ఇది సాధ్యమవుతుందన్నారు. దేశానికి సొంతనెట్‌వర్క్ టెలికాం వ్యవస్థ అవసరమన్నారు. మనం వినియోగిస్తున్న మొబైల్ ఫోన్లు దేశీయంగా ఉత్పత్తి చేయాలన్నారు. పదేళ్లకోసారి టెక్నాలజీలో మార్పులు వస్తాయన్నారు. ఆయా దేశాల ప్రజల అవసరాలకు అనుగుణంగా సాంకేతికత అభివృద్ధి చేయడం పై ఐటీయూ పనిచేస్తుందన్నారు. ఏయూ ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ రాధాకృష్ణను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు, విభాగాధిపతి ఆచార్య టి.జ్యోత్స్న, డీన్ ఆచార్య కె.రమాసుధ తదితరులు పాల్గొన్నారు.

ఎండాడ డబుల్ రోడ్డులో స్వచ్ఛభారత్

ఎండాడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్నేషనల్ హౌస్ కీపింగ్ వారోత్సవాల్లో భాగంగా గీతం యూనివర్సిటీలో విధులు నిర్వర్తిస్తున్న హౌస్‌కీపింగ్ సిబ్బంది సోమవారం ఎండాడ డబుల్ రోడ్డులో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వర్గీయ డాక్టర్ ఎంవీవీఎస్ మూర్తి స్మృతి వనం నుంచి రుషికొండ కూడలి వరకు రోడ్డుకి ఇరువైపులా ఉన్న చెత్తను తొలగించారు. గీతం ఆస్పత్రి విభాగం డైరెక్టర్ హేమంత్ బగ్గా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వందకి పైగా సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు నీటి సమస్య పరిష్కరించాలి

పద్మనాభం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనంతవరం పంచాయతీ గొల్లలపాలెంలో మురుగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ స్థానికులు ఎంపీడీఓ విజయకుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో మురుగునీటి పారుదలకు మార్గం లేక వాడుక నీరు, వర్షం నీరు ఏకమై ఇళ్ల మధ్య ఉండిపోవడంతో విష జ్వరాలు, డయేరియా బారిన పడాల్సి వస్తోందన్నారు. ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా మురుగు నీటి పారుదలకు పరిష్కారం చూపడం లేదని చెప్పారు. అధికారులు స్పందించి డ్రైనేజీ ఏర్పాటు చేయడంతో పాటు తాగునీటి సమస్యను కూడా పరిష్కరించాలని కోరారు.



ఇంజనీర్లను సన్మానిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

దేశ ప్రగతికి బాటలు వేసేది ఇంజనీర్లే : మేయర్

వెంకోజీపాలెం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇంజనీర్లు దేశ ప్రగతికి పునాదని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో జాతీయ ఇంజనీర్ల దినోత్సవం సందర్భంగా సోమవారం డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరావుతో కలిసి ఇంజనీర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఇంజనీర్లను గౌరవించాలన్నారు. ఇంజనీర్ల పితామహుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఏటా సెప్టెంబరు 15న జాతీయ ఇంజనీర్ల దినోత్సవం నిర్వహించుకుంటున్నామన్నారు. ఆయన సేవలు ఎనలేనివని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు, వైసీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీర్ సంపత్‌కుమార్, కార్యనిర్వాహక ఇంజనీర్లు దిలీప్, మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి అభినందన



తిరుమల శ్రీదేవిని అభినందిస్తున్న జీవీఎంసీ కమిషనర్ గార్గ్

వెంకోజీపాలెం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్న భీమిలి జీవీఎంసీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు మాదాబత్తుల తిరుమల శ్రీదేవిని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అభినందించారు. ఆయన చాంబర్లో సోమవారం శ్రీదేవి కమిషనర్‌ను కలిశారు. ఈ సందర్భగా కమిషనర్ మాట్లాడుతూ విద్యా బోధనతో పాటు చిన్నారులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో శ్రీదేవి ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. ఆమెకు అవార్డు రావడంతో నగరానికి పేరు ప్రతిష్ఠలు దక్కాయన్నారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ఉన్నతికి నిరంతరం కృషి చేయాలని సూచించారు.

విశాఖ ఉక్కును పరిరక్షించుకుంటాం: ఏఐవైఎఫ్



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏఐవైఎఫ్ నాయకుల నిరసన

సిరిపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రుల త్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకుంటామని ఏఐవైఎఫ్ సభ్యులు ప్రతినబూనారు. సోమవారం వారు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించారు. దాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు వై. రాంబాబు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ అంశంపై జేపీ నడ్డా ఎటువంటి ప్రకటన చేయకపోవడం విచారకరమన్నారు. రాష్ట్ర ప్రజలను బీజేపీ మోసం చేస్తోందన్నారు. ఉక్కు పరిశ్రమను నిర్వీర్యం చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను అడ్డుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి నాగరాజు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వనజాక్షి, మధురెడ్డి, రమణ, హేమానంద్ పాల్గొన్నారు.

రహదారులను ఆక్రమిస్తే చర్యలు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రహదారులు, స్టీల్‌ప్లాంట్ స్థలాలను ఆక్రమిస్తే సహించేది లేదని, త్వరలోనే ఈ స్థలాలకు ఆనుకుని ఉన్న బడ్డీలు తొలగిస్తామని హెచ్‌బీకాలనీ స్టీల్‌ప్లాంట్ స్థలాల భద్రత ఇన్‌చార్జి ఆంజనేయులు, జోన్-3 జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ హెచ్చరించారు. హెచ్‌బీకాలనీ సంతమార్గంలోని స్టీల్‌ప్లాంట్ స్థలాలకు ఆనుకుని ఉన్న రోడ్లపై వ్యాపారాలు సాగిస్తున్న వారిపై స్టీల్‌ప్లాంట్ భద్రతా సిబ్బంది, జీవీఎంసీ జోన్-3 జెడ్సీ శివప్రసాద్, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బడ్డీల కారణంగా అసాంఘిక కార్యకలాపాలు ఎక్కువవుతున్నాయని, స్థానికులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, యజమానులు ఆక్రమిత స్థలాలను స్వచ్ఛందంగా తొలగించాలని చెప్పారు. లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ భద్రతా సిబ్బంది కోటేశ్వరరావు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

రాజీవ్‌నగర్‌లో చోరీ

ఆరిలోవ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు మూడు తులాల బంగారు ఆభరణాలను చోరీ చేశారు. ఈ సంఘటన జీవీఎంసీ పదో వార్డు పాతడైరీ ఫారం సమీపంలోని రాజీవ్‌నగర్‌లో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి... విశాఖ వేలీ స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న శారద సోమవారం ఉదయం ఇంటికి తాళం వేసి పాఠశాలకు వెళ్లారు. మధ్యాహ్న భోజనానికి తిరిగి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని మూడు తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. వెంటనే ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ హరికృష్ణ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు తులం చైను, రెండు తులాల నక్లెస్ చోరీకి గురయ్యాయని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఇన్నోవేషన్ పాస్‌పోర్టుతో ఎన్నో ప్రయోజనాలు

ఏపీ మెడ్‌టెక్ జోన్ సీఈవో జీతేంద్రశర్మ

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇన్నోవేషన్ పాస్‌పోర్టు అంటే కేవలం మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా మార్కెట్ సమయం, ఖర్చులను తగ్గించి భారతీయ స్టార్టప్‌లు ప్రపంచవ్యాప్తంగా పోటీ పడడానికి సహాయపడే ఎండ్ టూ ఎండ్ సపోర్టు సిస్టమ్‌ను సృష్టించడమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మెడ్‌టెక్ జోన్ సీఈవో జీతేంద్రశర్మ అన్నారు. మెడ్‌టెక్ జోన్‌లో సోమవారం ఇన్నోవేషన్ పాస్‌పోర్టు ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే అగ్రగామి ఇంటిగ్రేడెట్ మెడికల్ డివైస్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ మెడ్‌టెక్ జోన్‌లో జరుగుతుందన్నారు. ఆరోగ్య సంరక్షణ, ఆలోచనలకు ప్రభావంతమైన సొల్యూషన్‌గా మార్చడానికి ఇదొక ప్రత్యేకమైన సింగిల్ యాక్సెస్ గేట్ వే అని పేర్కొన్నారు. ఇన్నోవేషన్ పాస్‌పోర్టులో ఇప్పటికే 75 ఇంక్యుబేటర్లు ఉన్నాయని, ఇవి దేశమంతటా వెయ్యికి పైగా స్టార్టప్‌లను అనుసంధానం చేస్తాయన్నారు. కార్యక్రమంలో పలువురు మెడ్‌టెక్ జోన్ అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ సివిల్ డిఫెన్స్ ఇన్‌స్పెక్టర్‌గా కేవై రెడ్డి


కేవై.రెడ్డిని అభినందిస్తున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పౌర రక్షణ రంగంలో విశిష్ట సేవలందిస్తున్నవాల్తేరు డివిజన్ సివిల్ డిఫెన్స్ ఇన్‌స్పెక్టర్ కేవై.రెడ్డికి 2024 వార్షిక సంవత్సరానికి గాను 'ఉత్తమ సివిల్ డిఫెన్స్ ఇన్‌స్పెక్టర్‌గా' కేంద్ర హోం శాఖలోని డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్, సివిల్ డిఫెన్స్, హోంగార్డు శాఖ నుంచి అవార్డు దక్కింది. ఈ సందర్భంగా వాల్తేరు రైల్వే డీఆర్ఎం లలిత్ బొహ్రా సోమవారం తన కార్యాలయంలో కేవై.రెడ్డిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవై.రెడ్డి అందించిన ఆదర్శప్రాయమైన సేవలకు మంచి గుర్తింపు వచ్చిందని, సివిల్ డిఫెన్స్ వలంటీర్లకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఎంతో పాటు సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ ఏకే.ముతత్కర్ పాల్గొన్నారు.

దుర్గాగణపతి హుండీ ఆదాయం రూ.1,84,727


హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

సీతంపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక దుర్గా గణపతి ఆలయంలో హుండీలను సోమవారం లెక్కించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి రామభాయి, కరక చెట్టు అమ్మవారి కార్యనిర్వాహణాధికారి కె.గాయత్రి పర్యవేక్షణలో ఆలయంలో హుండీలను లెక్కించారు. హుండీలో రూ.1,84,727 ఆదాయ వచ్చినట్టు దుర్గాగణపతి ఆలయం ఈఓ తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

» ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధుల వినతి


తహశీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

సీతమ్మధార, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం ఆలస్యం చేస్తోందని, ఉద్యోగులకు జరగాల్సిన ఆర్థిక ప్రయోజనాలు కల్పించడంలో ప్రభుత్వం ఉద్యోగుల పక్షం వహించడం లేదని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు లేవని ఫెడరేషన్ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ నాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతు సీతమ్మధారలో ఉన్న అర్బన్ తహశీల్దార్ పీవీవీ ప్రసాద్‌కు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ 257 జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రామకృష్ణరావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరావు, సీతమ్మధార మండల అధ్యక్ష, కార్యదర్శులు బలిరెడ్డి శ్రీనివాసరావు, బీకే దుర్గాకుమారి, మహారాణిపేట మండల అధ్యక్షుడు బండారు దేముడు బాబు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

తెలుగు భాషను రక్షించుకోవాలి

» ప్రాథమిక విద్యాబోధన పూర్తిగా తెలుగులోనే ఉండాలి
» ప్రభుత్వ పెద్దలతో అసెంబ్లీ సమావేశాల్లోనే తేల్చుకుంటాము
» తెలుగు దండు వ్యవస్థాపక అధ్యక్షుడు పరవస్తు సూరి


సమావేశంలో మాట్లాడుతున్న పరవస్తు సూరి

సీతంపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలుగును ఒక పాఠ్యాంశంగా కాకుండా, విద్యాబోధన మొత్తం తెలుగుభాషలో ఉండాలని తెలుగుదండు ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రభుత్వం తెలుగు మాధ్యమం పట్ల సానుకూల నిర్ణయం తీసుకోని పక్షంలో గాంధీయ మార్గంలో సాగే మాతృభాష పరిరక్షణ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శాంతిపురంలో ఉన్న తెలుగు దండు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో తెలుగుదండు వ్యవస్థాపక అధ్యక్షుడు పరవస్తు సూరి మాట్లాడుతూ తెలుగు భాషను అవమానించినా, నిర్లక్ష్యం చేసినా తెలుగు నేల క్షమించదని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏర్పడి ఏడాదిన్నర పూర్తయినప్పటికీ భాష రక్షణ వియంలో ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. గత ప్రభుత్వం తెలుగు భాషను నాశనం చేసిందని మాటలు చేప్పారని, అధికారంలోకి వచ్చిన తరువాత ఇంకా చర్యలరు తీసుకోకపోవడం గమనార్హమన్నారు. ప్రాథమిక విద్యా బోధన మాతృభాషలో ఉండాలని ఎన్నో ఏళ్లగా మేధావులు, భాషాభిమానులు చేస్తున్న ఎన్నో అభ్యర్థనలు చేస్తున్నారని అన్నారు. అసెంబీల్ల సమావేశాల్లో చర్చించి మాతృభాషాభివృద్ధికి ప్రాధికార సంస్థను ఏర్పాటు చేయాలని, ప్రాథమిక విద్యాబోధన కచ్చితంగా తెలుగులోనే జరిగేలా అధికారిక ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. 18 నుంచి జరిగే అసెంబ్లి సమావేశాలకు వెళతామని, తెలుగుభాష రక్షణ గురించి ప్రభుత్వ పెద్దలతో మాట్లాడతామని తెలిపారు. వందలాది కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, భాషాభిమానులు, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారని, అసెంబ్లి సమావేశాలు ముగిసేంత వరకు అక్కడే ఉండడానికి సిద్ధంగా ఉన్నారని, తమ నిరసనలు తెలియజేస్తామని అన్నారు. ఈ సమావేశంలో వేదుల కామేశ్వర శర్మ, సీహెచ్ చిన సూర్యనారాయణ, కేవీఎస్ మూర్తి, వరహారశెట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

57వ వార్డులో ఎమ్మెల్యే గణబాబు పర్యాటన


అధికారులకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే గణబాబు

మర్రిపాలెం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 57వ వార్డు మర్రిపాలెం శ్యామ్‌నగర్ కాలనీలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వచ్చిన నీటి ప్రవాహానికి మట్టి కొట్టుకుపోవడంతో గెడ్డ గోడను ఆనుకుని ఉన్న ఇల్లు, పక్కనే ఉన్న ట్రాన్‌ఫార్మర్ ఆదివారం రాత్రి కూలిపోయాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గణబాబు సోమవారం ఉదయం శ్యామ్ నగర్ కాలనీలో పర్యటించి కూలిన వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీలైనంత త్వరగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవలిన అధికారులకు సూచించారు. అనంతరం ఇల్లు కూలిపోయిన బాధితులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోన్ -5 కమిషనర్ బి.రాము, ఈపీడీసీఎల్ ఈఈ నాయుడు, 57వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పెంటకోట అజేయ్‌బాబు ముర్రు నానాజీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి అండర్-19 స్కూల్ గేమ్స్

విశాఖపట్నం, స్పోర్ట్స్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అండర్ 19 బాలబాలికల స్కూల్ గేమ్స్ ఈనెల 18 నుంచి నిర్వహించనున్నామని కార్యనిర్వాహక కార్యదర్శి వీఏ పుష్పలత తెలిపారు. ఇంటర్‌మీడియేట్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించనున్న క్రీడా పోటీల్లో పాల్గొనేవారు జనవరి ఒకటి, 2007 లేదా ఆ తర్వాత పుట్టినవారై ఉండి, ఆరు నుంచి 12వ తరగతి వరకు చదువుతుండాలన్నారు. 18న పరవాడ ఎస్‌వీఎస్ జూనియర్ కాలేజీలో రెజ్లింగ్, తైక్వాండో, మోడరన్ పెంటాథ్లాన్, మార్షల్ ఆర్ట్స్ తంగాట, గట్కా పోటీలుంటాయి. 19న ఏయూ గ్రౌండ్‌లో టెన్నిస్, వైఎంసీఏలో స్విమ్మింగ్, వాటర్ పోలో, వుడా పార్కులో స్కేటింగ్, బీచ్ వాలీబాల్, గోపాలపట్నం ఇండోర్ స్పోర్ట్స్ హాల్లో టేబుల్ టెన్నిస్, జిమ్నాస్టిక్స్ బుల్లయ్య కాలేజీలో వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలుంటాయి. ఈనెల 20న అనకాపల్లి ఏఎంఏఎల్ జూనియర్ కాలేజీలో అథ్లెటిక్స్, రగ్బీ పోటీలుంటాయన్నారు. వివరాలకు 9440885898, 9985065340, 9951676965 నంబర్లలో సంప్రతించాలన్నారు.

చిన్నారి కాదు చిరుత కూన

» ఏడు కిలో మీటర్ల ట్రెక్కింగ్‌ను పూర్తి చేసిన ఆద్య


తండ్రి భరత్‌తో ఆద్య

విశాఖపట్నం, స్పోర్ట్స్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కంబాల కొండ ట్రెక్కింగ్‌ను ఏడేళ్ల చిన్నారి ఆద్య పూర్తి చేసి అందరినీ ఆశ్చర్యా పరిచింది. ఏడు కిలో మీటర్ల కఠినమైన ట్రెక్కింగ్‌ను తన తండ్రి భరత్‌తో కలిసి పూర్తి చేసి 'అతి చిన్న వయసులో ట్రెక్కింగ్‌ను విజయవంతంగా పూర్తి చేసిన ఘనత సాధించింది. ఆద్య తాతయ్య ఎం. నారాయణరావు మాజీ అథ్లెట్ కాగా ప్రస్తుతం ఏపీ అథ్లెటిక్స్ జట్టు సెలక్షన్ కమిటీ చైర్మన్, జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శిగా సేవలందిస్తున్నారు. ఈ నేపథ్యంలో చిన్నతనం నుంచే ఆద్యకు శారీరక పటుత్వంపై అవగాహన కల్పించడంతోపాటు సాధనకు ప్రోత్సహిస్తూ భవిష్యత్తులో అంతర్జాతీయ ట్రెక్కర్‌గా తీర్చిదిద్దుతానన్నారు.

నగరానికి నెదర్లాండ్స్ రాయబారి


విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న మారిస గెరార్డ్స్

గోపాలపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మూడు దేశాల పర్యటనలో భాగంగా నెదర్లాండ్స్‌త రాయబారి మారిస గెరార్డ్స్ సోమవారం రాత్రి విశాఖ చేరుకున్నారు. రాత్రి 11.15 గంటలకు ఢిల్లీ నుంచి ఆమె ఇక్కడి విమానాశ్రయానికి చేరుకున్నారు. విశాఖతో పాటు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఈ నెల 18వ తేదీ వరకు ఆమె పర్యటించనున్నారు. అనంతరం నేపాల్, బూటాన్ దేశాల పర్యటనకు వెళతారు.

శుద్ధి చేసిన మురుగునీటితో సంపద సృష్టి

... 5వ పేజీ తరువాయి

వీడియోలను ప్రదర్శించామన్నారు. మురుగునీటిని శుద్ధి చేయడానికి భారీగా ఖర్చు చేస్తున్నామని, ఆదాయం సమకూర్చుకోవడం కోసం శుద్ధి చేసిన నీటిని పరిశ్రమలకు విక్రయించడం ప్రారంభించగా, వారి నుంచి డిమాండ్ పెరుగుతోందని వివరించామన్నారు. ప్రస్తుతం శుద్ధి చేసిన మురుగునీటిని కిలోలీటర్ రూ.60 చొప్పున ప్రతీరోజూ 67 ఎంఎల్‌డీ విక్రయిస్తున్నామని, భవిష్యత్తులో 210 ఎంఎల్‌డీ నీటిని విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకున్నందున దానికి సంబంధించిన ప్రణాళికలను వివరించానన్నారు. దీనికి అందరి నుంచి మంచి స్పందన లభించడంతోపాటు ఆయా నగరాల్లో కూడా దీనిని అమలుచేసే మార్గాలపై దృష్టిసారిస్తామని తనతో పేర్కొన్నారన్నారు.

మరోవైపు సూరత్ మోడల్‌లో నగరంలో భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణకు సంబంధించి కనస్ట్రక్షన్ అండ్ డిమాలిస్డ్ వేస్ట్ (సీ అండ్ డీ) ప్లాంటును నిర్వహించాలని నిర్ణయించామన్నారు. జీవీఎంసీలో సీ అండ్ డీ ప్లాంటు నిర్వహణకు జీవీఎంసీయే కాంట్రాక్టర్‌కు డబ్బులు చెల్లిస్తుండగా, సూరత్‌లో డెవలపరే అక్కడి కార్పొరేషన్‌కు డబ్బులు కడుతుండడం తనను ఆకట్టుకుందన్నారు. శిథిల భవనాలు, పాత భవనాలను ఎవరైనా కూల్చివేసి దాని స్థానంలో కొత్తనిర్మాణం చేపట్టాలంటే ముందుగా నగర పాలక సంస్థ అనుమతి కోసం దరఖాస్తు చేస్తారన్నారు. ఆ సమయంలోనే డెబ్రిస్‌ను యార్డుకు తరలించడానికి అయ్యే ఖర్చును భవన యజమాని నుంచి వసూలుచేస్తున్నారన్నారు. ఆ డెబ్రిస్‌ను కాంట్రాక్టర్ (డెవలపర్) యార్డుకు తీసుకువెళ్లి అక్కడ టైల్స్, సిమెంట్ ఇటుకలు తయారుచేసి విక్రయించుకుంటున్నారన్నారు. దీనివల్ల అక్కడి కార్పొరేషన్‌పై ఆర్థిక భారం పడకుండా, తిరిగి ఆదాయం చేరుతోందన్నారు. అదే మోడల్‌ను త్వరలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఆర్టీసీ అధికారుల ఉక్కిరిబిక్కిరి

... 5వ పేజీ తరువాయి

సంఖ్య పెరిగింది. దీంతో ట్రాఫిక్ నియంత్రణ ఆర్టీసీ అధికారులకు కత్తిమీద సాములా తయారయ్యింది. ఈ నేపథ్యంలో ప్రయాణ సమయం మార్చుకోవాలని ఆర్టీసీ అధికారులు కోరుతున్నారు. మరోవైపు విశాఖ రీజియన్‌కు కనీసం 170 బస్సులు సత్వరమే పంపాలని ప్రధాన కార్యాలయానికి రీజనల్ మేనేజర్ లేఖ రాశారు.

ప్రతిరోజూ ఉదయం 7.00 నుంచి 10.00 గంటలు, సాయంత్రం 4.00 నుంచి రాత్రి 7.00 మధ్య 1.6 లక్షల మంది విద్యార్థులు (పాస్‌లు తీసుకున్న సంఖ్య) ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. ఇదే సమయంలో ఉద్యోగాలకు, వ్యాపారాలకు, ఇతర వ్యవహారాలకు సంబంధించి పురుషులు, మహిళలు మరో లక్షన్నర మంది ప్రయాణిస్తున్నారు. స్త్రీశక్తి పథకం అమలు తరువాత పెరిగిన లక్ష మంది ప్రయాణికుల్లో ఎక్కువ మంది అవే సమయాల్లో ప్రయాణాలు చేస్తున్నారు. ప్రయాణికుల సంఖ్యకు తగ్గట్టుగా బస్సులు సమకూర్చడం అధికారులకు అసాధ్యమవుతున్నది. ద్వారకా బస్‌స్టేషన్, మద్దిలపాలెం, సింహాచలం, ఎంవీపీ కాలనీ బస్ స్టేషన్‌ల్లో ప్రయాణికులు బస్సుల కోసం గంటల సమయం వేచి ఉండాల్సిన పరిస్థితి వచ్చింది.

అధికారులపై పెరుగుతున్న ఒత్తిడి

కాంప్లెక్స్‌లో గంట నుంచి ఉంటున్నా బస్సులు రాలేదని, ఎప్పుడో వచ్చిన బస్సు ఎక్కేందుకు ఒకరినొకరు నెట్టుకోవలసి వస్తోందని ఆర్టీసీ అధికారులను మహిళలు ఫిర్యాదులు చేస్తున్నారు. వేరే రూట్‌ల నుంచి బస్సులు రప్పించాలని యత్నించినా అక్కడా ఇదే పరిస్థితి. బస్సుల కోసం ఆర్టీసీ అధికారులపై ఒత్తిడి పెరుగుతున్నది.

ఉపాధ్యాయ ఎంపిక జాబితా విడుదల

... 5వ పేజీ తరువాయి

అందించనున్నారు. ఈ సందర్భంగా టాపర్లు కొందరికి మాట్లాడే అవకాశం ఇవ్వనుండడంతో జిల్లా నుంచి ఇద్దరు, ముగ్గురి పేర్లతో జాబితాను అధికారులు పంపించారు. నియామక పత్రాలు అందుకునేందుకు అభ్యర్థులు ఈ నెల 18న ఉదయం 7.30 గంటలకు ఉక్కు నగరంలోని విశాఖ విమల విద్యాలయం స్కూల్ నుంచి బస్సులో వెలగపూడికి బయలుదేరుతారు. మెగా డీఎస్సీకి సంబంధించి డీఈవో కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటుచేశారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ 94404 84917, 91772 92969, 96185 84051 నంబర్లకు ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చునని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రేమ్‌కుమార్ తెలిపారు.

వేతనాల కోసం ఉక్కు ఉద్యోగుల ఆందోళన

... 5వ పేజీ తరువాయి

షోకాజు నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. జీతాల విషయంలో స్థానిక ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వైటీ దాసు, యు.రామస్వామి, పి.శ్రీనివాసరాజు, కె.గంగాధర్, రాజు, పుల్లారావు, అప్పారావు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటక్ ఆధ్వర్యంలో....

జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఇంటక్ ఆధ్వర్యంలో బీసీ గేటు వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ జీతాల కోసం ప్రతి నెలా ఎదురు చూపులు తప్పడం లేదన్నారు. సంస్థ కోసం నిరంతరం శ్రమిస్తున్న కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పీవీ రమణమూర్తి, బీఎస్ రాజు, నీరుకొండ రామచంద్రరావు, కొమ్ము ప్రసాద్, వెంకన్న, ఈశ్వరరావు, పోతారెడ్డి, అవతారం పాల్గొన్నారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు ఘన నివాళి


విశ్వేశ్వరయ్య విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు

కంచరపాలెం,సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజినీర్స్ డే వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ఉన్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కో యూనివర్సిటీ డైరెక్టర్ అల్తాఫ్ హుస్సేన్ హాజరైయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ రంగంలో విశ్వేశ్వరయ్య అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏపీ ఈపీడీసీఎల్‌లో...

సీతమ్మధార, (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) కార్పొరేట్ కార్యాలయంలో భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజనీర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో విశ్వేశ్వరయ్య చిత్రపటానికి సిబ్బంది పూలమాలలను వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీజీఎంలు మాట్లాడుతూ దేశాభివృద్ధికి విశ్వేశ్వరయ్య అందించిన సేవలు మరువలేనివని, ఆయన జీవితం ప్రతి ఇంజనీర్‌కు ఆదర్శమని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి మెరుగైన సేవలు అందించేందుకు ఇంజనీర్లు మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్లు వి.విజయలలిత, డి.సుమన్ కల్యాణి, బి.శ్రీదేవి, కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అన్ని వర్గాలకు లబ్ధి

» టీడీపీ వార్డు అధ్యక్షుడు బండి రంజిత్


సంబరాలు చేసుకుంటున్న ఆటో డ్రైవర్లు

కంచరపాలెం,సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దసరా కానుకగా ఆటోడ్రైవర్లకు రూ.15వేలు నగదు సహాయం అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడంతో 55వ వార్డులోని ఆటోడ్రైవర్లు సోమవారం సంబరాలు జరుపుకున్నారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు బండి రంజిత్ ఆధ్వర్యంలో స్థానిక గంగన్న నగర్, తిక్కవానిపాలెం గ్రామాలకు చెందిన ఆటో డ్రైవర్లు చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రంజిత్ మాట్లాడుతూ చంద్రబాబుతోనే అన్ని వర్గాలకు లబ్ధిచేకూరుతుందని అన్నారు. ఎంపీ భరత్ ఆదేశాల మేరకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి నేతృత్వంలో ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రతి ఇంటికి తీసుకువెళుతున్నామని అన్నారు. అనంతరం ఆటో డ్రైవర్లుకు వార్డు కమిటీ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్యదర్శి ఎస్.రమణ అప్పారావు, జనసేన అధ్యక్షుడు నూకరాజు, తదితర నాయకులు పాల్గొన్నారు.

మెట్రో టెండర్లలో మార్పు

... 5వ పేజీ తరువాయి

దశ ప్రాజెక్టు రూ.11,498 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఇందులో డబుల్ డెక్కర్ చేరడంతో అదనంగా మరో రూ.2,000 కోట్లు అవసరమని భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు మొత్తం 99.75 ఎకరాలు అవసరమని నిర్ధారించారు. అందులో సుమారు పది ఎకరాలు ప్రైవేటు భూమి ఉంది. ఆ భూ సేకరణకు మరో రూ.882 కోట్లు అవసరమని గతంలోనే లెక్కలు వేశారు. అంటే మొత్తంగా చూసుకుంటే తొలిదశ నిర్మాణానికి రూ.14,380 కోట్లు అవసరం. ఇందులో ప్రస్తుత ప్రణాళిక ప్రకారం 60 శాతం నిధులు పీపీపీ విధానంలో సేకరించి, మిగిలిన 40 శాతం నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా పెట్టుకోవాలనే ప్రాతిపదికన ఫైల్ నడుపుతున్నారు. ఈ నెల 19న జరిగే సమావేశంలో మొదటి దశ పనులు ఎన్ని భాగాలుగా చేసి కాంట్రాక్టర్లకు అప్పగిస్తారనే అంశంపై స్పష్టత వస్తుంది. అప్పుడే ఇది ముందుకు కదులుతుంది.

సర్వీస్ రంగంలో విశాఖకు ఏ+

... 5వ పేజీ తరువాయి

స్వచ్ఛాంధ్రలో 63 పాయింట్లతో బి గ్రేడ్ సాధించింది. వ్యవసాయ రంగంలో 26 ప్లాయింట్లతో 'సి' గ్రేడ్‌కు పరిమితమైంది. ఏడాదికి రూ.6,791 కోట్లు లక్ష్యం ఇవ్వగా, తొలి క్వార్టర్‌లో కేవలం రూ.749 కోట్లు సాధించింది. పరిశ్రమల రంగంలో 63 పాయింట్లతో 'బి' గ్రేడ్ దక్కించుకుంది. జిల్లాకు రూ.59,535 కోట్లు లక్ష్యం ఇవ్వగా తొలి క్వార్టర్‌లో రూ.8,030 కోట్లతో 13.49 శాతం సాధించింది. కాగా, విశాఖపట్నంలో పర్యాటక అభివృద్ధికి ఒకేచోట 50 ఎకరాలు సేకరించామని పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి అజయ్ జైన్ ఈ సందర్భంగా ప్రకటించారు.

చోరీ కేసులను ఛేదించిన పరవాడ పోలీసులు

» ఇద్దరు నిందితుల అరెస్టు
» ఐదున్నర తులాల బంగారం, 20 తులాల వెండి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న సీఐ మల్లికార్జునరావు

లంకెలపాలెం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు లంకెలపాలెంలోని శ్రీరామ నగర్ కాలనీ, రామాలయం ప్రాంతాల్లో గత రెండు నెలల వ్యవధిలో జరిగిన రెండు దొంగతనాల కేసులను పరవాడ పోలీసులు ఛేదించారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి ఐదున్నర తులాల బంగారం, 20 తులాల వెండిని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి సీఐ ఆర్.మల్లికార్జునరావు సోమవారం రాత్రి తెలిపిన వివరాలివి. లంకెలపాలెం దరి శ్రీరామనగర్ కాలనీలో నివాసముంటున్న సూరిశెట్టి వెంకట లక్ష్మి ఇంట్లో ఈ ఏడాది జూన్ 21న, రామాలయం వీధిలో నివాసముంటున్న డొంకాడ విమలాకుమారి ఇంట్లో జూలై 12న చోరీలు జరిగాయి. ఈ రెండు కేసుల్లో పదిన్నర తులాల బంగారం, 20 తులాల వెండిని దొంగలు దోచుకుపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివిధ కోణాల్లో విచారణ జరపగా తెలంగాణ రాష్ట్రంలోని సంగారెడ్డి దరి పటాన్ చెరువు ప్రాంతానికి చెందిన కోనాం రవితేజ, లంకెలపాలెం సమీపంలోని గంజిపేటకు చెందిన జామిశెట్టి కృష్ణ చైతన్యలు చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. వీరిద్దరినీ సోమవారం మధ్యాహ్నం లంకెలపాలెం ఐఓసీ పెట్రోల్ బంకు వద్ద అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసులను ఛేదించిన సిబ్బందిని ఎస్పీ తుహిన్‌సిన్హా, క్రైమ్ విభాగం అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు అభినందించారు.

నగరంలో సంయుక్తా మీనన్ సందడి


సంయుక్తా మీనన్

రామ్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సినీ హీరోయిన్ సంయుక్తా మీనన్ సోమవారం నగరంలో సందడి చేసారు, సార్, విరూపాక్ష వంటి చిత్రాలలో నటించిన సంయుక్తా మీనన్ సోమవారం నగరంలో ఒక ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చారు. ఈ సందర్భంగా రామ్‌నగర్‌లోని ఓ హోటల్‌లో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తనకు విశాఖ నగరం, ఇక్కడ బీచ్ అంటే చాలా ఇష్టమన్నారు. అనంతరం తాను నటిస్తున్న చిత్రాల వివరాలను వివరించారు. యువత ఫిట్‌నెస్ సాధించేందుకు శారీరక శ్రమ అవసరమని, అప్పుడే ఆరోగ్యంగా ఉంటారన్నారు.

19న జాబ్‌మేళా

కంచరపాలెం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బాలికల ఐటీఐ ప్రాంగణంలో ఉన్న నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో శుక్రవారం జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు ప్రాంతీయ ఉపాధి కల్పనాధికారి శ్యాం సుందర్ పేర్కొన్నారు. ఈ జాబ్‌మేళాలో ముత్తూట్ ఫైనాన్స్, జాబ్ డీలర్స్, ఎంఎన్‌సీ మ్యానుఫాక్చరింగ్ సంస్థ ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. రిలేషన్‌షిప్ ఆఫీసర్, బీపీవో టెలీ కాలింగ్ సేల్స్, అసెంబ్లీ ఆపరేటర్ తదితర ఉద్యోగాలను భర్తీ చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ జాబ్‌మేళాకు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ అర్హత ఉన్న అభ్యర్థులు హాజరుకావచ్చని చెప్పారు. ఎంపికైనవారు విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందని, అభ్యర్థులు తమ వివరాలను ముందుగా నేషనల్ కెరీర్ సర్వీస్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. జాబ్‌మేళాకు వచ్చే అభ్యర్థులు 19 తేదీన ఉదయం 10 గంటలకు తమ ధ్రువపత్రాలతో హాజరుకావలని తెలిపారు.

పదోన్నతులకు డీఈవో పూల్ పండితుల ఎదురుచూపులు

విశాఖపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖాధికారి పూల్‌లో ఉన్న గ్రేడ్-2 భాషా పండితులు ఏళ్లుగా పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్నారు. ఆది నుంచీ గ్రేడ్-2 భాషా పండితుల పదోన్నతులపై విద్యాశాఖ ఉన్నతాధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారనే విమర్శలున్నాయి. చివరకు కోర్టును ఆశ్రయించడంతో డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును కూడా అమలు చేయకపోవడంపై ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో 2019లో గ్రేడ్-2 భాషా పండితులను స్కూల్ అసిస్టెంట్ తత్సమాన కేడర్‌కలిగిన గ్రేడ్-1 భాషా పండితులుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. దీనికి అనుగుణంగా పాఠశాల విద్యాశాఖ అప్పట్లో మెమో జారీచేసినా 2019లో ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో అమలు పెండింగ్‌లో పెట్టారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ గ్రేడ్-2 భాషాపండితుల పదోన్నతుల జీవో రద్దుచేసింది. ఈ నేపథ్యంలో వారితో పాటు అర్హతలున్న ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించేలా జీవో ఇచ్చారు. దీంతో గ్రేడ్-2 పండితులు, ఎస్జీటీలకు పదోన్నతులు లభించడంతో మరికొందరు పండితులు చివరకు డీఈవో పూల్‌లోకి వెళ్లాల్సి వచ్చింది. గత ఆరేళ్లుగా వీరంతా బదిలీలు జరిగిన ప్రతిసారీ ఒకచోట నుంచి మరో చోటకు వెళ్తున్నారు. పదోన్నతులపై గ్రేడ్-2 పండితులు, ఎస్జీటీల మధ్య వివాదంలో పండితులకు అనుకూలంగా తీర్పు వచ్చింది. కోర్టు తీర్పును తక్షణం అమలుచేయాలని వారంతా కోరుతున్నారు.

భూ ఆక్రమణలకు సహకరిస్తున్న అధికారులు

మహారాణిపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 51 వ వార్డు మాధవధారలో సర్వేనంబరు 9లో ఉన్న ప్రభుత్వ భూమిని జిరాయితీ భూమిగా చూపిస్తు ప్రభుత్వ అధికారులు చేసిన అక్రమ రిజిస్ట్రేషన్లను, పన్నులను వెంటనే రద్దు చేయాలని మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం కన్వీనర్ శ్రీలక్ష్మి డిమాండ్ చేశారు. మురికవాడ భూములను ఆక్రమించుకునేందుకు కబ్జాదారులకు సహకరిస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. పేదలకు నివాసాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో బ్యాంక్ మేనేజర్ ఆత్మహత్యాయత్నం

మహారాణిపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందుతలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సమాచారం అందంతో సమాయానికి వెళ్లి కాపాడిన టూటౌన్ పోలీసులు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఎంవీపీ కాలనీలో నివాసం ఉంటున్న భైరవపట్ల శ్రీరామ్(41) హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, పని ఒత్తిడిని తట్టుకోలేక సూర్యబాగ్‌లోని సోమవారం ఉదయం ఒక హోటల్‌లో రూమ్ తీసుకుని, గదికి గడియ పెట్టుకుని పురుగు మంది తాగాడు. గది నుంచి పురుగుల మందు వాసన రావడం గుర్తించిన హోటల్ సిబ్బంది వెంటనే టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని తలుపులు బద్దలుకొట్టి అపస్మారక స్థితిలో ఉన్న శ్రీరామ్‌ను కేజీహెచ్‌కు తరలించారు. తాను అత్మహత్య చేసుకోవడానికి ఆర్థిక ఇబ్బందులే కారణమని లేఖలో పేర్కొన్నాడు. సమయానికి ఆస్పత్రికి తరలించడంతో శ్రీరామ్ ఆరోగ్యం నిలకడగా ఉన్నదని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై విచారణ జరుపుతున్నట్టు సీఐ తెలిపారు.


ఓపీ కౌంటర్ వద్ద రోగులు

పీహెచ్‌సీకి రోగుల తాకిడి

గాజువాక, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోజురోజుకు రోగుల తాకిడి అధికమవుతుంది. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులు, వర్షాల వల్ల ప్రజలు అనారోగ్యాల బారినపడుతున్నారు. దీంతో జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడేవారు అధికంగా వైద్య సేవల కోసం పీహెచ్‌సీకి వస్తున్నారు. దీంతో గతంలో కంటే ఆస్పత్రికి వచ్చే వారి సంఖ్య పెరిగింది. రోజుకు సుమారు 200 మంది వరకు రోగులు వస్తున్నారని వైద్యాధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఆస్పత్రికి వచ్చే రోగులందరికీ తగిన సేవలు అందిస్తున్నామని, మందులన్నీ అందుబాటులో ఉన్నాయని ఆయనన్నారు.

సీతారాం ఏచూరికి నివాళి

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్మిక సమస్యలతో పాటు ప్రజలు ఎదొర్కొన్న అనేక ఇబ్బందులపై పోరాటాలు చేసి విజయం సాధించిన సీపీఎం నేత సీతారాం ఏచూరిని నేటి నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని భెల్ హెచ్‌పీవీపీ (సీఐటీయూ) నాయకుడు జె.కోటేశ్వరరావు అన్నారు. భెల్ హెచ్‌పీవీపీలో సోమవారం జరిగిన సీతారాం ఏచూరి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు జీటీపీ ప్రకాశ్, సనపల జగన్నాథరావు, అల్సి అప్పలనారాయణ, సీతంనాయుడు, మురళీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి ఘన సత్కారం

అగనంపూడి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్న బీసీ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు డి.ఇందిరా ప్రియదర్శిని సోమవారం స్థానిక నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల, విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్న ఇందిరా ప్రియదర్శినికి ఉత్తమ అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, జనసేన వార్డు అధ్యక్షుడు గవర సోమశేఖర్, నాయకులు ప్రసాద్, కె.జగదీశ్, పి.వసంతరావు, నరసింగరావు, సత్యవతి, వాసు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం హెచ్‌ఎంకు..

అక్కిరెడ్డిపాలెం: గుంటూరులో ఆపన్న ప్రదీపన్న బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఉపాధ్యాయులకు ప్రదానం చేసే ప్రతిష్టాత్మక రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎంఎల్ఎస్ కాంతం ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం గుంటూరులో జరిగిన అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమంలో మాజీ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జి.శ్రీకాంత్ చేతుల మీదుగా ఆమె అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, ఉపాధ్యాయ సంఘ నేతలు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **మిరాయి** : జగదాంబ, మెలోడి, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కిష్కిందపురి** : లీలామహల్, సంగం, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక),
- **అర్జున్ చక్రవర్తి** : రమాదేవి,
- **మదరాసి** : శ్రీకన్య
- **ఘాటీ** : కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : , శ్రీకన్య-2 (గాజువాక)
- **కూలీ** :వెంకటేశ్వర-1, అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 15, టమాటా 24, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 28, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 46, దొండకాయలు 38, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది) 70, బరబాటి 30, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 64, కీరదోస 32, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 32, చిలగడదుంపలు 35, కంద 40, దేముడు చిక్కుడు 76, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాల కూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	130
లైవ్ ధర	150
విత్ స్కిన్	270
స్కిన్‌లెస్	280

యువ ఇంజనీర్లు మోక్షగుండాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

▸ ఐలా ఇన్‌చార్జి చైర్మన్ కొల్లి ఈశ్వరరావు


మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎ.కిశోర్, కొల్లి ఈశ్వరరావు, తదితరులు

ఆటోనగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచం గర్వించదగ్గ అతి కొద్ది మంది ఇంజనీర్లలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఒకరని, ఆయనను యువ ఇంజ నీర్లందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఐలా ఇన్‌చార్జి చైర్మన్ కొల్లి ఈశ్వరరావు అన్నారు. ఇంజనీర్స్ డేను పుర స్కరించుకుని సోమవారం ఆటోనగర్ ఐలా ఉద్యాన వనంలో గల మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొల్లి ఈశ్వరరావు మాట్లాడుతూ యువ ఇంజనీర్లందరూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. ఐలా కమిషనర్ ఎ.కిశోర్ మాట్లా డుతూ మానవ వికాసం పారిశ్రామిక అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అధ్యక్షుడు సజ్జ పాండురంగ ప్రసాద్ మాట్లాడుతూ యువత కొత్త ఆవిష్కరణల వైపు మొగ్గు చూపాలని, అప్పుడే దేశం పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఐలా ప్రధాన కార్యదర్శి చీకటి సత్యనారాయణ మాట్లాడుతూ పారిశ్రామిక రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుప డతాయన్నారు. తొలుత ఆటోనగర్‌కు చెందిన పారిశ్రామికవేత్తలంతా మోక్షగుండం విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం ఉత్తమ ఇంజనీర్లు ఆర్.రజనీకాంత్, ఎస్.గౌతమ్, అశోక్ బన్సాల్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఐలా, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల సభ్యులు ఎన్.శేషగిరిరావు, యార్లగడ్డ సాంబశివరావు, రామకృష్ణంరాజు, ఈశ్వరప్రసాద్, కిశోర్, ఎన్.సత్య నాగిరెడ్డి, అనారోబాబు, పరుచూరి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలపై పట్టు సాధించాలి

అగనంపూడి: నూతన ఆవిష్కరణలతో పాటు పరిశోధనలపై విద్యార్థులు పట్టు సాధించాలని బార్క్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. ఇంజనీర్స్ డేను పురస్కరించుకుని దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన విస్టా-2025 టెక్నికల్ ఫెస్ట్ సోమవారంతో ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాసరావు ముందుగా విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రతిఒక్కరూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని రాణించాలన్నారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను తిలకించారు. వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ మధుసూదనరావు, కన్వీనర్ క్రాంతికుమార్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.


ప్లాంట్ ట్రైనింగ్ సెంటర్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు, కార్మికులు

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని నిరసన

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహించిన కాంట్రాక్టు కార్మికులను తొలగించడం సరికాదని, తొలగించిన వారందరినీ తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం ప్లాంట్ ట్రైనింగ్ సెంటర్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు నిర్వాసిత నాయకులు మాట్లాడుతూ కార్మికుల పట్ల ఉక్కు యాజమాన్యం దుర్మార్గంగా వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి కూలీలను తీసుకువచ్చి పనులు చేయిస్తుండడం దారుణమన్నారు. ప్లాంట్ కోసం సర్వం కోల్పోయిన నిర్వాసితులకు అన్యాయం చేయడం సబబు కాదన్నారు. తమకు న్యాయం జరిగేంత వరకు పోరాటాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పితాని భాస్కరరావు, ఉమ్మిడి అప్పారావు, ప్రసాద్, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, రమణ, వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ఉక్కు ఉద్యోగులకు జీతాలు చెల్లించాలంటూ బీసీ గేటు వద్ద ఆందోళన చేస్తున్న ఇంటక్ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్, నాయకులు పీవీ రమణమూర్తి, జీఎస్ రాజు, ఎన్.రామచంద్రరావు, ప్రసాద్, వెంకన్న, ఈశ్వరరావు, పోతారెడ్డి, అవతారం, తదితరులు


ఇన్నోవేషన్ పాస్‌పోర్టు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జితేంద్రశర్మ, తదితరులు


ఇన్నోవేషన్ పాస్‌పోర్టుతో ఎన్నో ప్రయోజనాలు

▸ ఏపీ మెడ్‌టెక్ జోన్ సీఈవో జితేంద్రశర్మ

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇన్నోవేషన్ పాస్‌పోర్టు అంటే కేవలం మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా మార్కెట్ సమయం, ఖర్చులను తగ్గించి భారతీయ స్టార్టప్‌లు ప్రపంచవ్యాప్తంగా పోటీ పడడానికి సహాయపడే ఎండ్ టూ ఎండ్ సపోర్టు సిస్టమ్‌ను సృష్టించడమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మెడ్‌టెక్ జోన్ సీఈవో జితేంద్రశర్మ అన్నారు. మెడ్‌టెక్ జోన్‌లో సోమవారం ఇన్నోవేషన్ పాస్‌పోర్టు ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే అగ్రగామి ఇంటిగ్రేటెడ్ మెడికల్ డివైస్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ మెడ్‌టెక్ జోన్‌లో జరుగుతుందన్నారు. ఆరోగ్య సంరక్షణ, ఆలోచనలకు ప్రభావంతమైన సొల్యూషన్‌గా మార్చడానికి ఇదొక ప్రత్యేకమైన సింగిల్ యాక్సెస్ గేట్ వే అని పేర్కొన్నారు. ఇన్నోవేషన్ పాస్‌పోర్టులో ఇప్పటికే 75 ఇంక్యుబేటర్లు ఉన్నాయని, ఇవి దేశమంతటా వెయ్యికి పైగా స్టార్టప్‌లను అనుసంధాన చేస్తాయన్నారు. కార్యక్రమంలో పలుఉరు మెడ్‌టెక్ జోన్ అధికారులు పాల్గొన్నారు.

ఉక్కు కార్మిక నాయకులకు షోకాజ్ నోటీసులు

విశాఖపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో సెప్టెంబరు నెలకు సంబంధించి జీతాల విషయంలో తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ గాను ముగ్గురు కార్మిక సంఘ నాయకులకు ఉక్కు యాజమాన్యం సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఇటీవల కాలంలో జీతాల విషయంపై కొంతమంది కార్మిక నాయకులు మాట్లాడారు. దీనిని తీవ్రంగా పరిగణించిన యాజమాన్యం వారికి షోకాజ్ నోటీసులు ఇచ్చింది. ఇదిలావుండగా సోమవారం కొన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జీతాల అంశానికి సంబంధించిన ఆందోళనలు చేపట్టారు. ఈ ఆందోళనలో పాల్గొన్న ఉద్యోగులకు కూడా షోకాజ్ నోటీసులు ఇచ్చేందుకు ఉక్కు యాజమాన్యం సిద్ధపడుతున్నట్టు తెలిసింది.


పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న శిష్టకరణ సంఘ ప్రతినిధులు

కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించాలని వినతి

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గాజువాక ప్రాంతంలో పది వేలకు పైగా శిష్టకరణాల కుటుంబాలు ఉన్నాయని, అయితే తమకు కమ్యూనిటీ హాల్ (సామాజిక భవనం) లేదని, ఇందుకోసం స్థలం కేటాయించవలసిందిగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు రాష్ట్ర శిష్టకరణ సంఘం అధ్యక్షుడు అక్కుమహంతి నాగేశ్వరరావు (రాజా) కోరారు. ఈ మేరకు సోమవారం శ్రీనగర్‌కు విచ్చేసిన పల్లాకు గాజువాక సంఘ ప్రతినిధులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. శిష్టకరణాల కోసం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పల్లాను కలిసిన వారిలో సంఘం ప్రతినిధులు బాసంగి తిరుపతిరావు, బలివాడ సత్యారావు, ప్రతాపరావు, శ్రీనివాసరావు, విజయలక్ష్మి, కవిత, తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన 'పల్లా'

శ్రీనగర్: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 71వ వార్డు శ్రీనగర్‌లో సోమవారం రూ.72.07 లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తాను ఇచ్చిన ప్రతి హామీకి కట్టుబడి ఉంటానన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజాన రామారావు, టీడీపీ రాష్ట్ర పరిశీలకుడు పప్పు రాజారావు, కూటమి నాయకులు కరణం కనకారావు, పప్పు శంకరరావు, బొడ్డేడ నాయుడు, ప్రతాపరావు, శ్రీనివాసరావు, రామచంద్రరావు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ 'గాజువాక' బీసీ సెల్ అధికార ప్రతినిధిగా వెంకటరావు


మాడిశ వెంకటరావు

అగనంపూడి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ గాజువాక నియోజకవర్గ బీసీ సెల్ అధికార ప్రతినిధిగా అగనంపూడికి చెందిన మాడిశ వెంకటరావును పార్టీ అధిష్ఠానం నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తనకు ఈ బాధ్యతలను అప్పగించిన సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రసాదాల శ్రీనివాస్, కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా అప్పలరాజు


వి.అప్పలరాజు

పెదగంట్యాడ: టీడీపీ గాజువాక నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా వంగలపూడి అప్పలరాజును నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజాహిత కార్యక్రమాలను నిర్వహించాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పేర్కొన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను అప్పగించిన పల్లా శ్రీనివాసరావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

'సర్వహిత' ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ

అగనంపూడి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పెదమడక సర్వహిత చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులైన 65 మందికి ప్రతినెలా మాదిరిగానే ఒక్కొక్కరికి రూ.200 చొప్పున సోమవారం అందజేశారు. పలు పేద కుటుంబాలకు నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వి.కృష్ణంరాజు, ట్రస్టు ప్రతినిధులు గుదే సుశీలగజేంద్రరరావు, మస్తాన్ రెడ్డి, గోవిందరావు, నరసింగరావు, కొండలరావు, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పునరావృతం కారాదు

▸ పెందుర్తి మండల సమావేశంలో ఎమ్మెల్యే 'పంచకర్ల' ▸ గృహ నిర్మాణాలు చేపట్టని వారి పట్టాల రద్దుకు ఆదేశం ▸ గ్రామాల్లో పరిస్థితులు వివరించిన సభ్యులు


సభ్యులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాల అభివృద్ధికి నిధులు సమకూర్చుతానని, విధులు సక్రమంగా నిర్వర్తించి సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అధికారులకు సూచించారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ మధుపాడ నాగమణి ఆధ్వర్యంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత శాఖల వారీగా సమీక్షించారు. సమావేశానికి పలువురు అధికారులు గైర్హాజరు కావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పలువురు సభ్యులు మాట్లాడుతూ గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో నిర్మాణం చేసిన గృహాల్లో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. పట్టా పొందిన తరువాత ఇల్లు కట్టకుండా విక్రయాలు జరుపుతున్నారని, మళ్లీ ఇల్లు లేదని అంటున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. గతంలో మండల వ్యాప్తంగా తొమ్మిది లేఅవుట్‌లలో 1754 ఇళ్లు మంజూరైనప్పటికీ 854 మాత్రమే నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని ఆ శాఖ అధికారులు తెలిపారు. అసలు ఇళ్ల నిర్మాణాలు జరపని లబ్ధిదారుల పట్టాలను రద్దు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. జల్‌జీవన్ మిషన్ పథకం పనులు అస్తవ్యస్తంగా జరుగుతున్నాయని పలువురు ఆరోపించారు. జంగాలిపాలెం, పెదగాడి, చింతలగ్రహారం గ్రామాల్లో రూ.కోటి నిధులు మంజూరైనా రహదారి నిర్మాణాలు, అలాగే సరిపల్లి ఎస్ఆర్ పురం వెల్‌బీబీ సెంటర్ల నిర్మాణం, ఎస్ఆర్‌పురం, చింతగట్లలో ఆర్బీకే సెంటర్, చింతగట్ల, జంగాలిపాలెంలో పంచాయతీ భవనాలు పూర్తికాలేదని, వీటిని పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదని ఆయా సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. గొరపల్లిలో రైతుల సాగులో ఉన్న భూములపై రియల్టర్ తప్పుడు పత్రాలతో ప్రవేశించి రైతులను ఇక్కట్లుకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. జంగాలిపాలెంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించారని, గ్రామ కంఠం భూములకు యజమాన్య హక్కులు కల్పించాని సభ్యులు కోరారు. దీనిపై తహశీల్దార్ వెంకట అప్పారావు సమాధాన మిస్తూ గ్రామకంఠం భూములకు అన్ని పత్రాలు ఉండి, స్థానిక పంచాయతీ కార్యదర్శి సిఫార్స్ చేస్తే రెవెన్యూ శాఖ నుంచి ఎన్‌వోసీ ఇవ్వగలమన్నారు. అనంతరం మరికొంత మంది సభ్యులు సమస్యలను సభలో వివరించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో కొల్లి వెంకట్రావు, తహశీల్దార్ వెంకటఅప్పారావుతో పాటు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అత్యంత భక్తిశ్రద్ధలతో వైష్ణవ కృష్ణాష్టమి


కృష్ణుని అలంకరణలో వెంకన్న

పెందుర్తి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి వెంకటాద్రి శిఖరంపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం వైష్ణవ కృష్ణాష్టమిని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి ఉత్సవ విగ్రహాన్ని కృష్ణుడి రూపంలో అలంకరించారు. వివిధ రకాల పుష్పాలతో ఊయల కట్టి అందులో అలంకార ప్రాయుడైన కృష్ణుడ్ని ఉంచి ప్రధానర్చకులు మహర్తి రామానుజాచార్యులు ప్రత్యేక పూజలు జరిపారు.

నాయుడుతోట రవినగర్‌లో...

వేపగుంట : నాయుడుతోట రవినగర్‌లో గల శేషాద్రి కొండపై గల కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామివారి విగ్రహాన్ని సుందరంగా అలంకరించి, ప్రత్యేక పూజలు జరిపారు. చిన్నారులు కృష్ణుని వేషధారణలో అలరించి, ఉట్టికొట్టారు. అర్చకులు శ్రీనివాసస్వామి, శ్రీహరి, కృష్ణమూర్తి, ఆదినారాయణలతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'పేద కుటుంబాల ఆర్థిక ప్రగతే పీ-4 లక్ష్యం'

పెందుర్తి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలను ఆదుకోవడమే పీ-4 లక్ష్యమని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. పెందుర్తిలోని స్టేషన్ రోడ్డులో ఏర్పాటు చేసిన స్వర్ణాంధ్ర- 2047 నియోజకవర్గ దార్శనిక కార్యచరణ ప్రణాళిక కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ఇప్పటికే ఈ కార్యక్రమంపై నియోజకవర్గ విజన్ డాక్యుమెంట్ పూర్తి చేశామని, అమలుకు శ్రీకారం చుట్టామని వివరించారు. ఈ బృహత్కార్యంలో అంతా భాగస్వాములు కావాలని కోరారు. జడ్పీ శంకర్రావు, బీజేపీ నాయకుడు గొర్లె రామునాయుడు, గొర్లె అప్పారావు, ఆర్ఎస్ నాయుడు, సేనాపతి సోమశేఖర్, పిన్నింటి పార్వతి, కరక దేవుడు, గొర్లె రామకృష్ణ, బైలపూడి హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు. సర్పంచ్ దూది విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గొరపల్లి సోమునాయుడు, గంట్రెడ్డి నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉడా భూముల వివాదంపై రైతులతో చర్చ

వేపగుంట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానికంగా ఉన్న ఉడా భూముల వివాదంపై రైతులతో సదరు అధికారులు సోమవారం సామజిక భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంత వరకు రైతుల నుంచి స్వీకరించి భూమి పత్రాలు తదితర వివరాలతో కూడిన తొలి జాబితాను చదివి వినిపించారు. అంతేకాకుండా రైతులు అందించిన పత్రాల అధారంగా వాస్తవ భూముల వివరాలను ఉడా సిబ్బంది పర్యటించి వీక్షిస్తారన్నారు. అంతరంవీటికి వ్యత్యాసాలు, రైతులు అభ్యంతరాలను తెలుసుకోనున్నారు. కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, ఉడా డిప్యూటీ తహశీల్దార్ భారతి, ఈఓ కృష్ణ పెందుర్తి రెవెన్యూ డీటీ అశోక్ పాల్గొన్నారు.

మల్కాపురంలో మూలకు చేరిన 'రక్షక్'

మల్కాపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మల్కాపురం పోలీసు స్టేషన్ పరిధిలో గత రెండు రోజులుగా పోలీసులు పూర్తిస్థాయిలో నైట్ రౌండ్స్ తిరగడం లేదు. దీంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో అనేక సమస్యాత్మక ప్రదేశాలు ఉన్నాయి. ఇక్కడ పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తుంటారు. ఇక్కడ ఎటువంటి సంఘటన జరిగిన వెంటనే అప్రమత్తం అవుతుంటారు. అయితే నైట్ రౌండ్స్ తిరగాల్సిన రక్షక్ వాహనం మూలకు చేరింది. సాధరణంగా ఇటువంటి జీపులు పాడైతే వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా మరో జీపు ఇవ్వాల్సి ఉన్నా అధికారులు ఆ దిశగా ఆలోచన చేయలేదు.

మార్గదర్శి మోక్షగుండం విశ్వేశ్వరయ్య

▸ ఇంజనీర్స్ డేలో కీర్తించిన వక్తలు ▸ విద్యార్థులకు దిశా నిర్దేశం



ఆళ్వార్స్ కళాశాలలో ముఖ్య అతిథి మాధవ్‌బాబును సత్కరించిన యాజమాన్యం, అధ్యాపక బృందం


నరవ కళాశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద అధ్యాపకుల నివాళి

వేపగుంట సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గోపాలపట్నం పెట్రోల్ బంకు దరి ఆళ్వార్ క్యాంపస్‌లో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలో ఇంజనీర్స్ డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఏయూ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎం.జి.మాధవ్ బాబు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మోక్షగుండం విశ్వేశ్వరయ్యను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. విశ్వేశరయ్య జీవితం, దేశానికి అందించిన సేవలను బీఎస్ఎన్ఎల్ జేటీవో సిహెచ్.దుర్గాప్రసాద్ వివరించారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల ప్రతినిధులు మాధవ్ బాబును సత్కరించారు. ఏయూ ప్రొఫెసర్ కె.తులసీ బలరామ్ పాదల్, ఏపీ ట్రాన్స్‌కో గాజువాక డీఈ మురళీమోహన్, కె.తులసీకుమార్, కళాశాల కో-ఆర్డినేటర్ జీవీఎస్ భగవాన్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ గోపి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.రాజు, బి.హేమచంద్రరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నరవలో ఇంజనీరింగ్ కళాశాలలో...

గోపాలపట్నం : నరవలో గల విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఇంజనీర్స్ డేను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ డైరెక్టర్ టి.వి.సూర్య, ఏపీ టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.ఉమామహేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజనీరింగ్ పితామహుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య వంటి మహనీయుల్ని ఆదర్శంగా తీసుకుని నేటి యువతరం ఇంజనీర్లు నూతన ఆవిష్కరణలకు తెరతీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు చేసిన పలు ప్రాజెక్టుల్ని పరిశీలించి బహుమతుల్ని ప్రదానం చేశారు. అంతకు ముందు విశ్వేశ్వరయ్య చిత్రటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల చైర్మన్ జి.సత్యనారాయణ, డైరెక్టర్ బి.భాస్కరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి.ప్రదీప్ వర్మ, పి.ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

మల్కాపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : షీలానగర్ నుంచి కాన్వెంట్ జంక్షన్ వెళ్లే మార్గంలో ఈనెల 12వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఏలేశ్వరం వెంకట సీతామహాలక్ష్మి రత్నపాప (74) సోమవారం మృతి చెందారు. ఈమెతో పాటు ఆ ప్రమాదంలో గాయపడిన ముగ్గురు ప్రస్తుతం ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతు ఉన్నారు. మల్కాపురం ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి కట్టడికి డాగ్ స్క్వాడ్‌తో గాలింపు

గోపాలపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గంజాయి రవాణాతో పాటు సేవించే వారిపై కూడా ఉక్కుపాదం మోపేందుకు పోలీసులు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లోని ఎల్లపువానిపాలెం, కొత్తపాలెం గ్రామ శివార్లలో డాగ్ స్క్వాడ్‌తో సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ ప్రాంతాల్లో గంజాయి వినియోగించే ఆకతాయిల సంఖ్య ఎక్కువగా ఉండడంతో ఆయా ప్రాంతాలను గుర్తిస్తున్నారు. అదేవిధంగా సింహాచలం రైల్వే స్టేషన్ పరిసరాల్లో కూడా తనిఖీలు చేపట్టారు. ఎప్పటికప్పుడు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టి గంజాయి రవాణాను అరికట్టనున్నామని ప్రత్యేక బృంద పోలీసులు తెలిపారు.

బాలుడి వైద్యానికి దాతల ఆర్థిక సాయం

గోపాలపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి లక్ష్మీనగర్‌కు చెందిన ఏడాది బాలుడికి సోకిన అరుదైన వ్యాధికి చికిత్సల నిమిత్తం సాయం అందించేందుకు పలువురు దాతలు ముందుకు వచ్చారు. గోపాలపట్నానికి చెందిన కాంట్రాక్టర్ దీపక్ పవార్, వేపగుంటకు చెందిన అయ్యప్ప సేవాపీఠం, వెంకటాపురానికి చెందిన పైడిమాంబ ట్రస్ట్ సభ్యులు రూ.30వేల ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. బాలుడి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 11 అర్జీలు

వేపగుంట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పదకొండు మంది అర్జీలను అందజేశారు. ప్రతి ఒక్కరితో జడ్సీ హెచ్.శంకర్రావు స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆయా శాఖల అధికారులకు పంపి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.


భయపెడుతున్న బ్రెయిన్ స్ట్రోక్

ఇటీవల గణనీయంగా పెరుగుతున్న కేసులు

- కరోనా తరువాతే ఈ పరిస్థితి అంటున్న నిపుణులు
- రక్తనాళాల్లో క్లాటింగ్ మెకానిజం పెరగడమే కారణం
- గతంలో 50 ఏళ్లు దాటిన వారిలోనే సమస్య
- తాజాగా యువతలోనూ వెలుగులోకి
- జీవన విధానంలో మార్పులు, శారీరక శ్రమ లేకపోవడం, ఒత్తిడి, బీపీ, షుగర్, ఆల్కహాల్, ధూమపానం లాంటి అలవాట్లూ కారణమే
- కేజీహెచ్‌కు ప్రతిరోజూ 30 మంది బాధితులు



విశాఖపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): 'రామ్‌నగర్‌కి చెందిన రాజేష్ (38) స్నేహితులతో కలిసి అప్పటివరకు ఉత్సాహంగా క్రికెట్ ఆడాడు. ఆట ముగిసి ఇంటికి వెళ్లేందుకు సిద్దమ య్యారు. ఒక్కసారిగా వాంతులు, కళ్లు తిరగడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయాడు. కాళ్లు, చేతులు పడిపోయాయి. పరీక్షించిన వైద్యులు బ్రెయిన్‌స్ట్రోక్‌గా నిర్ధారించారు. సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లడంతో ఖరీదైన ఇంజక్షన్ ఇచ్చి కోలుకునేలా చేశారు'.



ఇటీవల ఈ తరహా కేసులు పెరుగుతున్నాయి. అప్పటి వరకు ఆరోగ్యంగా ఉన్న వారు ఒక్కసారిగా కుప్ప కూలిపోతున్నారు. పరీక్షలు చేస్తే బ్రెయిన్‌స్ట్రోక్‌గా తేలుతోంది. దీనికి అనేక అంశాలు కారణమంటున్నారు. గతంలో 50 ఏళ్లు దాటిన వారు, వృద్ధుల్లో మాత్రమే కనిపించే స్ట్రోక్ ఇప్పుడు 30 ఏళ్లలోపు యువతలోనూ వెలుగుచూడడం ఆందోళనకు గురిచేస్తోంది. కరోనా తరువాత యువతలో బ్రెయిన్, హార్ట్‌స్ట్రోక్ సంఖ్య పెరిగిందని, దీనికి రక్తాన్ని గడ్డ కట్టించే మెకానిజం శరీరంలో వృద్ధి చెందడమే కారణమంటున్నారు. దీనిపై పూర్తిస్థాయి అధ్యయనాలు లేకపోవడంతో నిర్దిష్ట కారణాలు తేలడం లేదు. అంతే కాదు జీవన విధానంలో మార్పులు, ఆహార అలవాట్లు సమస్య తీవ్రతకు కారణమంటున్నారు.

గణనీయంగా పెరిగిన కేసులు..

నగర పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు బ్రెయిన్ స్ట్రోక్ బాధితులు ప్రతిరోజూ పదుల సంఖ్యలో వస్తున్నారని చెబుతున్నారు. కేజీహెచ్‌కు ప్రతిరోజూ 30 మంది వస్తుంటారని, వీరిలో ఇస్కీమిక్ స్ట్రోక్ బారినపడి మూడు గంటల్లో ఆస్పత్రికి తీసుకు వచ్చిన వారు మూడు రోజులకు ఒకరు మాత్రమే ఉంటారని, వారికి ఖరీదైన ఇంజక్షన్ ఇచ్చి కోలుకునేలా చేస్తున్నామంటున్నారు. ఇక ప్రైవేటు ఆస్పత్రులకు ప్రతి రోజూ మరో 150 వరకు కేసులు వస్తుంటాయన్నారు. దేశంలో 20 సెకన్లకు ఒక బ్రెయిన్‌స్ట్రోక్ కేసు నమోదవుతోందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

బ్రెయిన్ స్ట్రోక్ అంటే.?

మెదడుకు రక్తం సరఫరా చేసే రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్ప డడాన్ని స్ట్రోక్ అంటారు. దీనివల్ల రక్తనాళం పగలడం, మెదడు కణజాలం చని పోవడంతో శరీరంలోని భాగాలు చచ్చుబడిపోతాయి. దీనిని పక్షవాతంగా పేర్కొంటారు. బ్రెయిన్ స్ట్రోక్ రెండు రకాలు. మొదటి ఇస్కీమిక్ స్ట్రోక్. బ్రెయిన్ స్ట్రోక్ కేసుల్లో 85 శాతం ఇవే ఉంటాయి. మెదడుకు రక్తం సరఫరా చేసే రక్తనాళాల్లో రక్తం గడ్డ కట్టడం వల్ల వచ్చే స్ట్రోక్ ఇది. రోగిని సకాలంలో ఆస్పత్రిలో చేర్పిస్తే ఒక ఇంజక్షన్ ఇచ్చి గడ్డను కరిగించి, కోలుకునేలా చేస్తారు. రెండోది బ్రెయిన్ హెమరేజ్. ఇందులో బ్రెయిన్‌లో తీవ్రమైన రక్తస్రావం అవుతుంది.

ముందే గుర్తించే చాన్స్..

బ్రెయిన్‌స్ట్రోక్ బారినపడడానికి ముందే కొన్ని లక్షణాలు అప్రమత్తం చేస్తాయి. వాటిని గుర్తించి ఆస్పత్రిలో చేరితే బయటపడేందుకు అవకా శం ఉంది. కాళ్లు, చేయి పడిపోవడం, మూతి పక్కకు వెళ్లడం, మాట పడిపోవడం, నడిస్తే తూలిపోవడం, తిమ్మిర్లు, అన్నం దిగకపోవడం వంటి లక్షణాలు కొన్ని క్షణాల నుంచి పది నిమిషాలు వరకు ఉండి, తిరిగి సాధారణ స్థితికి వచ్చేస్తారు. దీనిని ట్రాన్సియెంట్ ఇస్కీమిక్ అటా క్ (టీఐఏ) అంటారు. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే అప్రమత్తం కావాలి. లేదంటే కొద్దిరోజుల్లో తీవ్రమైన స్ట్రోక్ బారిన పడే ప్రమాదం ఉంది. అప్పుడే పుట్టిన చిన్నారి నుంచి వృద్ధుల వరకు అందరికీ బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి..

అధిక బీపీ, షుగర్, పొగ, మద్యం వంటి అలవాట్లున్న వారికి స్ట్రోక్ వచ్చే అవకాశం ఎక్కువ. శారీరక శ్రమ లోపించడం, స్థూలకాయం, ఒత్తిడి, రక్తంలో కొవ్వులు, ఆకుకూరలు, పండ్లు తీసుకోకపోవడం, జంక్‌ఫుడ్, ఆయిల్‌ఫుడ్ తీసుకోవడం, బయటి ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వడం, గురక, మత్తు పానీయాలు, మాంసాహారం అధికంగా తీసుకోవడం వంటి అంశాలు స్ట్రోక్‌కు దారితీస్తున్నాయి.

ఇవీ లక్షణాలు..

బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన వారిలో చేయి, కాలూ చచ్చుపడి పోవడం, మూతి పక్కకు లాగేయడం, కళ్లు తిరగడం, శరీరం తూలడం, ఒక వైపు చూపు తగ్గిపోవడం, మింగడం కష్టంగా ఉండడం, ఇద్దరు, రెండుగా కనిపించడం, స్పృహ తప్పిపోవడం, అకస్మాత్తుగా వాంతులు కావడం, అపస్మార స్థితిలోకి వెళ్లిపోవడం వంటి లక్షణాలుంటాయి.

సకాలంలో ఆస్పత్రికి తరలించాలి



ఆహార అలవాట్లు, జీవనవిధానంలో మార్పులే బ్రెయిన్‌స్ట్రోక్‌కు కారణం. బాధితుడిని మూడు గంటల్లోపు ఆస్పత్రికి తీసుకువస్తే ఓ ఇంజక్షన్ ఇచ్చి కోలుకునేలా చేస్తున్నాం. దురదృష్టవశాత్తు 100 మందిలో ఒకరిని మాత్రమే సకాలంలో తీసుకువస్తున్నారు. స్ట్రోక్స్‌ను ఎంఆర్ఐ, సీటీ పరీక్షల ద్వారా గుర్తిస్తాం. 25 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా బీపీ, షుగర్, థైరాయిడ్, లిపిడ్ ప్రొఫైల్ పరీక్షలు చేయించుకోవాలి. లిపిడ్స్ అధికంగా ఉన్నా స్ట్రోక్ వస్తుంది. దురలవాట్లకు దూరంగా ఉంటూ శారీరక శ్రమ, వ్యాయామాలు చేయాలి. కాలుష్యం కూడా కారణమవుతోంది. పండ్లు, ఆకుకూరలు, కూరగాయలకు ప్రాధాన్యత ఇవ్వాలి. క్లాటింగ్ మెకానిజాన్ని నిర్ధారించే పరీక్షలు చేయించుకుని మందులు వాడితే ప్రయోజనం ఉంటుంది.

- డాక్టర్ గోపి,
న్యూరాలజీ విభాగాధిపతి, కేజీహెచ్

పీజీఆర్ఎస్‌కు 329 అర్జీలు



వినతులు స్వీకరిస్తున్న డీఆర్వో, అధికారులు

మహారాణిపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 329 అర్జీలను అధికారులు స్వీకరించారు జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీశంకర్, ఇతర అధికారులు హాజరయ్యారు. రెవెన్యూ విభాగానికి 92, జీవీఎంసీకి 88, పోలీస్ శాఖకు 25, ఇతర విభాగాలకు 124 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఇప్పటివరకు అందిన ఫిర్యాదులు, తీసుకున్న చర్యలపై వివరణ తీసుకున్నారు. అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్ శేష శైలజ, సిటీ ప్లానర్ ధనుంజయ రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జీవీఎంసీకి 111 వినతులు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 111 వినతులు వచ్చాయని మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. పాత సమావేశ మందిరంలో అదనపు కమిషనర్లు డి.వి.రమణమూర్తి, ఎస్.ఎస్.వర్మలతో కలిసి వినతులు స్వీకరించారు. విభాగాధిపతులు వినతులను అదే రోజు పరిశీలించి, ఫిర్యాదుదారులతో సంప్రదించి సమస్యలు పరిష్కరించాలని, ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని సీఆర్పీల ధర్నా



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న సీఆర్పీలు

సిరిపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మెప్మా ఆర్పీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం జీవీఎంసీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షురాలు పి.మణి మాట్లాడుతూ ఆర్పీలకు మూడునెలల బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. పని భారం తగ్గించి, నిలిపివేసిన లాగిన్‌ను తక్షణమే ఇవ్వాలన్నారు. 22వ వార్డులో తొలగించిన ఆర్పీలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఉద్యోగ భద్రతకు విఘాతం కలిగించే విధంగా ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను రద్దుచేయాలన్నారు. ఆర్పీలపై జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు లక్ష్మి, ఝాన్సీ, సత్య వరలక్ష్మి, వందన, దేవి తదితరులు పాల్గొన్నారు.

టూరిజం రీజనల్ డైరెక్టర్‌గా కళ్యాణి



విశాఖపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్, ఏపీ టూరిజం అథారిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పీజీఎస్ కళ్యాణిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె ఏడాది పాటు డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తారు. ప్రస్తుతం కర్నూలులో రిజిస్ట్రేషన్ల శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్నారు.

నగరంలోనే అతిపెద్ద డాగ్ స్క్వాడ్

- డాగ్‌కెన్నెల్స్‌ను ప్రారంభించిన మేయర్



డాగ్ కెన్నెల్స్‌ను ప్రారంభిస్తున్న మేయర్, సీపీ

విశాఖపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్ పరిధి ఏఆర్ బారెక్స్‌లో రూ.18 లక్షలతో నిర్మించిన నాలుగు డాగ్‌కెన్నెల్స్‌ను జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు, సీపీ శంఖబ్రతబాగ్చి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అతిపెద్దనగరంగా, ఆర్థిక రాజధానిగా గుర్తింపు పొందిన విశాఖకు ప్రముఖుల తాకిడి ఉంటుందన్నారు. తరచూ జాతీయ, అంతర్జాతీయస్థాయి సదస్సులు జరుగుతున్నందున ప్రముఖుల భద్రత, గంజాయి, మాదకద్రవ్యాలకు అడ్డుకట్టవేయాల్సి ఉందన్నారు. భద్రతకు అవసరమైన డాగ్‌స్క్వాడ్‌తోపాటు సౌకర్యాలను కల్పించడం కోసం జీవీఎంసీ పోలీస్‌శాఖకు సహకరిస్తోందన్నారు. సీపీ మాట్లాడుతూ ప్రస్తుతం 17 డాగ్‌కెన్నెల్స్, 21 డాగ్‌స్క్వాడ్స్ ఉండగా, కొత్తగా నిర్మించిన నాలుగు కెన్నెల్స్ అందుబాటులోకి వచ్చాయన్నారు.21 డాగ్‌స్క్వాడ్స్‌తో నగరం ఇప్ప టికే రాష్ట్రంలో అతిపెద్ద డాగ్‌స్క్వాడ్ కలిగిన కమిషనరేట్‌గా గుర్తింపు పొందిందన్నారు. 21 డాగ్స్ లో రెండు నేరగాళ్లను పట్టుకోవడంలో శిక్షణ పొందిన ట్రాకర్స్ ప్రముఖుల పర్యటనల సందర్భంగా బాంబులు, మందుపాతరలను గుర్తించేందుకు ఉపయోగించే ఎక్స్‌ప్లోజివ్స్ డాగ్స్, మాదకద్రవ్యాలను పసిగట్టడంలో సహాయపడే నార్కోటిక్ డాగ్స్ పది ఉన్నాయన్నారు. ఇవికాకుండా మత్తుపదార్థాలను గుర్తించడంలో శిక్షణ పూర్తిచేసుకున్న మూడు డాగ్స్ ఇటీవల చేరాయన్నారు. డాగ్స్‌ను హ్యాండిల్ చేసేందుకు 26 మంది శిక్షణ పొందిన హ్యాండ్లర్స్ ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

క్రైం... crime news

తీరానికి చేరిన విద్యార్థుల మృతదేహాలు

- కన్నీరుమున్నీరుగా విలపించిన తల్లిదండ్రులు



విద్యార్థుల మృతదేహాలు

సాగర్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రుషికొండబీచ్ సమీపంలో సముద్రస్నానాలకు దిగి ఆదివారం గల్లంతైన ఇద్దరు విద్యార్థుల మృతదేహాలు సోమవారం ఉదయం రుషికొండ తీరానికి కొట్టుకువచ్చాయి. పీఎంపాలెం ప్రాంతానికి చెందిన నలుగురు బాలురు ఆదివారం సాయంత్రం రుషికొండ బీచ్ సమీపంలో సముద్రస్నానాలకు దిగి కెరటాల తాకిడికి కొట్టుకుపోయారు. వారిలో ఇద్దరు ప్రాణాలతో బయటపడగా మండల సంజయ్, మామిడిశెట్టి శ్యాంసాయి గల్లంతైన విషయం తెలిసిందే. తమ కుమారులు కనిపించకుండా పోవడంతో వారి తల్లిదండ్రులు తీరంలో రాత్రంతా తీవ్ర ఆందోళన మధ్య గాలించారు. బతికి వస్తారనే ఆశతో సము ద్రం వైపే చూస్తూ గడిపారు. అయితే వారి ఆశలు అడియాసలు చేస్తూ సోమవారం ఉదయం ఇద్దరు విద్యార్థుల మృతదేహాలు తీరానికి కొట్టుకువచ్చాయి. దీంతో వారి తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల రోదనలతో ఆ ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, పీఎం పాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మ్యూల్ అకౌంట్లు అందించిన ముగ్గురి అరెస్టు

ఎండాడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నేరగాళ్లకు మ్యూల్ అకౌంట్లు అందించిన ముగ్గురిని సైబర్ క్రైం పోలీసులు సోమవారం జైపూర్‌లో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సాగర్‌నగర్‌కు చెందిన మహిళకు ఈఏడాది మే 16న జపాన్ కోడ్‌తో ఉన్న నంబరు నుంచి కాల్ వచ్చింది. కజిన్‌నంటూ పరిచయం చేసుకుని అత్యవసరంగా డబ్బులు కావాలని అడిగారు. సదరు మహిళ తొలుత రూ.లక్ష పంపించారు. మళ్లీ కాల్ చేయడంతో మరో రూ. 50 వేలు, రూ. 2 లక్షలు, మరో రూ. 50 వేలు ట్రాన్స్‌ఫర్ చేశారు. మోసపోయినట్టు అనుమానం వచ్చి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఆ అకౌంట్లన్నీ రాజస్థాన్‌కు చెందినవిగా గుర్తించారు. సైబర్ నేరగాళ్లకు మ్యూల్ అకౌంట్లు సరఫరా చేసిన జైపూర్‌కు చెందిన మొయిద్దీన్ దేశ్వాలీ, గజేశ్ కుమావత్, టోంక్ జిల్లాకు చెందిన దినేశ్ ప్రజాపత్‌ను అరెస్టు చేశారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

ఎండాడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మహిళలు గాయపడ్డారు. ఎండాడ-రుషికొండ డబుల్ రోడ్డులో ఈ సంఘటనలు జరిగాయి. ఎంకే గోల్డ్ కోస్టు ప్రాంతంలో ఆదివారం అర్ధరాత్రి మహిళ రోడ్డు దాటుతుండగా వేగంగా వస్తున్న కారు ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడింది. స్థానికులు చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అదే రోడ్డులో సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహిళ ఎంకే గోల్డ్ కోస్టు సమీపంలోని మలుపు తిరుగుతుండగా డివైడర్‌పై వేలాడుతు కేబుల్ వైర్లు వాహనం అద్దానికి తగలడంతో రోడ్డుపై పడి గాయపడ్డారు. ఆమెను స్థానికులు ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వీటిపై ఫిర్యాదులు అందలేదని పీఎంపాలెం సీఐ బాలకృష్ణ తెలిపారు.

విమ్స్‌లో మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు

- రేపటి నుంచి అందుబాటులోకి రానున్న సేవలు
- హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభించిన డైరెక్టర్ రాంబాబు



హెల్ప్ డెస్క్‌ను ప్రారంభించిన విమ్స్ డైరెక్టర్ రాంబాబు, వైద్యులు

ఆరిలోవ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో స్వస్థ్ నారీ శక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించనున్నామని డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం హెల్ప్ డెస్క్‌ను ఆయన ప్రారంభించి, మాట్లాడుతూ 15 రోజుల పాటు మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఈనెల 17 నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. మహిళలకు క్యాన్సర్, షుగర్, బీపీ, ఈఎన్‌టీ, కళ్లు, ఊపిరి తిత్తులు, అధిక బరువు, తదితర సమస్యలకు సంబంధించిన వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తామన్నారు. పరీక్షల్లో వ్యాధులు ఉన్నట్టు నిర్ధారణ అయితే ఉచితంగా వైద్య సేవలు కూడా అందిస్తామన్నారు. అవయవదానంపై అవగాహన కల్పించడంతో పాటు రక్తదాన శిబిరం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలలో డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసకుమార్, ఆర్ఎంవో డాక్టర్ శిరీష, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.